# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

అక్టోబర్ 2025

వెల : రూ. 10.00



## జులై 21 నుండి ఆగష్టు 10 వరకు
## శ్రీ మాతాజీ యూరపు దేశాలపర్యటన దృశ్యములు



జర్మనీ లోని శ్రీరామ్, హనుమత్ జయప్రద గార్ల గృహమునందు



డెన్మార్క్ లోని శ్రీ ప్రసాదరాజు, విజయగార్ల గృహమునందు



డెన్మార్క్‌లోని వేల్ మురగన్ ఆలయంలో



వేల్ మురుగన్ ఆలయంలో సామూహిక పూజలు.

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org  samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45   సంచిక 2
పేజీలు 44
అక్టోబర్ 2025

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ.  10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


శ్రీ కాళీ ప్రసాద శతకము .................. ..........4
శ్రీబాబూజీ ఉవాచ...................................... 5
అమ్మమాట.................................... ........... 9
యోగక్షేమం .................................. ....... .......10
సర్వ చైతన్య రూపామ్.......... .........................13
కొప్పు లింగేశ్వరుడు ...................................15
భగవద్గీత సాధన దీపిక ..............................17
నరసింహ మెహతా... ............................ ................19
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ....... 21
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 23
నారద భక్తి సూత్రములు ............... ..............25
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....27
ప్రేమ మయం ....... ....................................28
నమ్మితే బంగారు పిచ్చుకే .......................30
నిరీక్షణ .................................................................32
శ్రీ గురుగీత ......................................... ........36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ....................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్



5. *గయ్యాళి పెండ్లాము యల్లరి పిల్లలు*
*భరియించలేక సన్యాసమందువు*
*కోటలోనుండి పోరు మేటిది గాదె*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*

తా: పెళ్ళాం గయ్యాళిదనో, పిల్లలు అప్రయోజకులనో క్షణికావేశంలో కొందరు సన్యాసం పుచ్చుకుంటూ ఉంటారు. తీరా పుచ్చుకున్న తరువాత మళ్ళీ ఇల్లు, కుటుంబ సభ్యులు గుర్తుకొచ్చి అలమటిస్తూ ఉంటారు. తరించాలంటే సన్యసించాలని ఎక్కడా చెప్పబడి లేదు. సన్యాసం బహు కష్టతరమైనది. ఇంద్రియాలు నిరంతరం దాడిచేస్తూ లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తూ వుంటాయి. సన్యాసి అరిషడ్వర్గముతో పోరాడటం అనేది కోట బయటికి వచ్చి శత్రువుతో యుద్ధం చేయటం లాంటిది. ఇక్కడ రక్షణకు అవకాశమే లేదు. ఒకసారి దెబ్బతింటే పూర్తి పతనమే. అదే సంసారి దుర్గుణాలతో చేసే యుద్ధం తాను కోటలోనే ఉండి బయట ఉన్న శత్రువుతో యుద్ధం చేయటం లాంటిది. ఇక్కడ అనేక రక్షణలు వుంటాయి. ఏమైనా పొరపాటు జరిగి ఒక గుణానికి లోబడినా, ధర్మబద్ధంగా ఆ కోరిక తీర్చుకొని మళ్ళీ విచారణ ద్వారా సన్మార్గంలో పయనించడానికి వీలు వుంటుంది.

1. ఒకసారి మనకు లభిస్తే తిరిగి మననుంచి దూరం కానిదేది?
2. ఈశ్వరుని నిర్మాల్య మాలలో పొడవైన వెంట్రుక ఎలా వచ్చింది?
3. గుఱ్ఱాలు, గోవులు ఎందుకు కన్నీరు కార్చాయి?
4. వదిన పెట్టిన బాధలు ఎలా భక్తి మార్గానికి దారితీశాయి?
5. శ్రీ బాబూజీ మహారాజ్ వారి “విశ్వసించు - తరించు” అన్న సూత్రము ఏ గీతావాక్యమునకు సారము?
6. శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడు అడిగిన మొదటి ప్రశ్నకు సమాధానం ఎందుకు చెప్పలేదు?
7. శిలామూర్తి ఎలా చైతన్యవంతమైనది?
8. అహోబిలంలో ఇంజనీరును రక్షించినది ఎవరు?

*సమాధానాలు లోపలి పేజీలలో .........................*

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

30-6-1981

ఈరోజు ఉదయం శ్రీ బాబుజీ వ్యాహ్యాళికి వస్తూ కృష్ణా, అర్జునా! ఏరి ఎక్కడ ఉన్నారు? అంటూ బిల్డింగ్‌పైకి వెళ్ళారు.



వాకింగ్ చేస్తూ అటు చూడండి అక్కడ ఇద్దరు భక్తులు ఉన్నారు. వారు బాల్యం నుంచి నాకు తెలుసు. బాల్యంలో ఎంతో భక్తితో ఉండేవారు. ఆశ్రమానికి వచ్చి వారం రోజులైంది. ఇంతవరకు వారి దర్శనభాగ్యం నాకు కల్గలేదు. అదీ వారి భక్తి. వారు నిలబడిన తీరుచూసి వారు ఎంతో భక్తులని మీరు అనుకుంటారు. అది వారి సంస్కారం. కాని వారి తండ్రి తాపత్రయపడతాడు. కాని ఏం చేస్తాము? వాళ్ళ పాపం పెద్ద హెూదాగల వుద్యోగస్థులు. ఇక్కడ మనతో వాకింగ్ చేస్తున్నాడు ఇతనిని చూడండి. ఉద్యోగం చేస్తున్నా చెవులకు పోగులు తీయమన్నా తీయలేదు. అది అతని సంస్కారము. చూశారా సంస్కారాలలో తేడా. క్రింద చూడండి ఎంతమంది నిలుచున్నారో. వారందరూ భగవత్ చింతన కోసమే నిలుచున్నారనుకుంటున్నారు కదూ! వారి వారి మనస్సులలో ఆలోచనలు, భావాలు అన్నీ నాకు వినపడతాయి. తెలిసినబాధ నాది, తెలియని బాధ మీది. ఈ విషయాదుల గురించి చింతన చేసినంతసేపు శాంతి ఉండదురా అంటే వింటారా!

ప్రతి ఒక్కరూ బాబుగారూ! అశాంతిగా ఉందండి అంటారు. పోనీ ఏదైనా పరిష్కార మార్గం చెప్పి ఈ దీక్ష ఇలా చేసుకోండి అంటే, దీక్ష చేయాలంటే ఆశ్రమంలోనే ఉండాలాండీ? అంటారు ఇలా ఉంటాయి నా తిప్పలు. ఏం చేస్తాము చెప్పండి.

అదుగో అక్కడ చూడండి ఆయన చాలా ధనవంతుడు. ఆయనని ఆశ్రమంలో ఉండమంటే ఉండడు. 'నేను ఇక్కడ వుంటే వ్యాపారం ఎట్లాగండీ? నేను కొట్లో కూర్చోవాలి బాబుగారూ!' అంటాడు. వ్యాపారం చూడటానికి ఆయన పుత్రులు వున్నారు. వారు చూసుకోగలరు. ఈయన ఇలాగే కొట్లో ఎక్కౌంట్లు చూస్తూ కాలక్షేపం చేస్తాడు. చివరికి ఈయన ఎక్కౌంటు పైవాడు చూస్తాడు" అన్నారు శ్రీ బాబూజీ.

పూర్వపు రోజులలో నేను ఎక్కడ వుంటే అక్కడికే అంతా వచ్చేవారు. ఎంతకాలమైనా వుండేవారు. పాపం మన తాతయ్యగారింట్లో ఎన్ని నెలలైనా వారందరికి ఎంతో సేవ చేసేవారు. వచ్చినవారు ఎంత కాలమైనా కదిలేవారుకాదు. బాబుగారు మమ్మల్ని వుండమన్నారు అనేవారు. ఆ విషయం నాకు తెలిసి సమావేశములో నేను మనము వచ్చిన పని అయిపోయింది, ఇక అందరు ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళవచ్చును అని హెచ్చరిక చేసినా వెళ్ళేవారు కాదు. శ్రీ బాబు మమ్మల్ని వుండమన్నారు మాతో మాట్లాడతామన్నారు అని చెప్పేవారు వచ్చిన భక్తులంతా.

మళ్ళీ సమావేశంలో ఆ విషయాన్ని గురించి ప్రస్తావించేవాడిని. నేను ఇప్పుడు ఎవ్వరితోనూ మాట్లాడను. మళ్ళీ కలుసుకున్నపుడు చూద్దాం అనేవాడిని. భక్తులంతా కలసి నాకు పూజ చేసేవారు. వారిని కాదనలేక అంగీకరించే వాడిని. నాకు పూజ చేసేటప్పుడు నేను ఉప్పొంగిపోయేవాడిని కాదు. పూజ అమ్మకి చెందినట్లుగా భావించేవాడిని. అమ్మా! జగజ్జననీ! ఈ పూజ నీకే, అందుకో అని ధ్యానంలో వుండేవాడిని. నాకు పొగడ్తలన్నా ఎడ్వర్టైజ్‌మెంటు అన్నా ఇష్టముండేదికాదు. ఇదంతా చూసి చివరకు ఈ ఆశ్రమ స్థాపనకు అంగీకరించాను. అప్పుడు తేలిపోయింది ఏవి గట్టిగింజలో ఏవి ఓటిగింజలో. గట్టిగింజలన్నీ దగ్గరకు చేరాయి. తప్పలు అన్నీ ఎగిరిపోయాయి. సగుణారాధన మనస్సు నిలబడటానికి చాల అవసరం. దానివలన మనస్సు నిలబడుతుంది. మనస్సు నిలబడిన తర్వాత ఆనందాన్ని పొందుతారు. కులతత్వము పోతేనే భగవత్సాక్షాత్కారము కలుగుతుంది గాని లేకపోతే కలగదు. మనది జగన్మాతా పితరుల వంశము. మనమంతా హరిదాసులము" అన్నారు శ్రీ బాబు.

ఇంతలో పురుషోత్తంగారు మాట్లాడుతూ, 'బాబూ! నిన్నటిరోజున ఏక్సిడెంటు జరిగింది. మీ రక్షణ లేకపోతే మాకు ప్రమాదం జరిగి ఉండేది' అన్నారు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'మీరు నన్ను పరమాత్ముడని అనుకుంటున్నారు కదూ! అటువంటి విశ్వాసము ఉండటము మంచిదే. మీ విశ్వాసము యొక్క శక్తి గొప్పది. అదే మిమ్మల్ని కాపాడుతుంది. నాదేముంది నేను ఆ జగజ్జనని చేతిలో ఒక పనిముట్టును.

మీకు ఒక దృష్టాంతము చెప్తాను. మేమంతా అహోబిలము వెళ్ళాము. మాతో ఒక ఇంజనీరు కూడా వచ్చాడు. కొండపైకి ఎక్కాము. క్రింద నీటిప్రవాహము ఉంది. నేను వద్దని ఎంత చెప్పినా వినకుండా ఆ ఇంజనీరు స్నానానికని కొండక్రింద ఉన్న నీటిప్రవాహములోనికి దిగాడు. అంతే! మళ్ళీ కనపడలేదు, అక్కడ ఉన్నవారంతా నిస్సహాయులై కేకలు వేస్తున్నారు. నేను అమ్మని ప్రార్థించి నా పంచచెంగుని గుండ్రంగా

త్రిప్పి నీటిలోనికి విసిరాను. అది నీటిలో మునిగిన ఇంజనీరుగారి శరీరానికి చుట్టుకుపోయింది. అంతా కలసి లాగితే ఒడ్డుకు వచ్చాడు తర్వాత అతనికి వైద్య సదుపాయము చేశామనుకోండి. మరి నీటిలో మునిగిన వ్యక్తిని కాపాడినది ఎవరు? నా రామ పాదుకల శక్తి వలననే రక్షణ జరిగిందిగాని నాదేమి ఉంది? అన్నారు శ్రీ బాబు తిరిగి మాట్లాడుతూ ఇంకొక పర్యాయము ఉత్తరదేశ యాత్ర ముగించుకుని నేను, మూర్తీజీ, సంధ్య, విజయ, కారులో డెహ్రాడూన్ నుంచి వస్తూండగా యాక్సిడెంట్ జరిగింది.

మూర్తీజీ కారు నడుపుతున్నారు. సంకీర్తన జరుగుతున్నది. మూర్తీజీకి నిదుర వస్తోంది. అది అస్సాము కొండల ప్రాంతము. అక్కడ పోలీసు గస్తీ కేంద్రాలు వున్నాయి. అది ప్రమాదభరితమైన ప్రాంతము. మూర్తీజీకి చాలసార్లు హెచ్చరిక చేశాను. నీకు నిదుర వస్తే కారు నిలిపివేయి దొంగల బారినుండి నేను రక్షించుకుంటాను. ఏమాత్రం భయంలేదు అని చెప్పాను. కాని మూర్తీజీ ప్రయాణాన్ని అలానే సాగించాడు. కారు అకస్మాత్తుగా ఒక బ్రిడ్జి మీదనుంచి 14 అడుగుల లోతున క్రిందకు పడిపోయింది. కారు ఇసుకలో పడి ప్రక్కకు ఒరిగింది. కారుపడ్డ ప్రాంతంలో నీరుగాని, రాళ్ళుగాని లేవు. ఈ జరిగిన ప్రమాదము కొంచెం ముందుగాని వెనకగాని జరిగి ఉంటే కారులో ఎవరూ రక్షింపబడేవారు కాదు.

విజయ చెయ్యి కారు తలుపుక్రింద పడింది. నాకు కాలుకి పెచ్చు లేచిపోయింది. చేతివేలు వంకరపోయింది. సంధ్యకి పెద్ద గండం తప్పింది. ఇంత జరిగినా నాకేమీ తెలియదు నేను ధ్యానంలో ఉన్నాను. ఇంతలో కళ్ళు తెరచి చూశాను. పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఒక్కసారి అమ్మా! అని కేకవేశాను. అంతే అక్కడే వున్నట్లుగా పోలీసు పరివారం అంతా వెంటనే వచ్చారు. వారు కారుని ఎత్తి మమ్మల్ని బయటికి తీశారు. ఆ జగజ్జనని మమ్మల్ని రక్షించింది. అమ్మ అనుగ్రహమే లేకుంటే ఆ అడవిప్రాంతంలో నిర్జన ప్రదేశంలో సహాయం ఎలా అందుతుంది? ఇప్పుడు మీకు చెప్పిన అన్ని సందర్భాలలో సహాయాన్ని అందించింది ఎవరు? నేనా? నా ద్వారా అమ్మ అందించింది. నేను ఒక పరికరాన్ని మాత్రమే! నేను అమ్మ చేతిలో పరికరాన్ని.

ఒక శిల్పి ఉన్నాడనుకోండి అతను రాయిలో, కొయ్యలో, దుంగలో అన్నింటిలో శ్రీకృష్ణ రూపాన్ని దర్శించగలుగుతాడు. అందుచేతనే శిల్పి తన పనిముట్టుతో శిల్పాన్ని చెక్కగలుగుతాడు. ఆ గొప్పతనం శిల్పిదా? లేక పనిముట్టుదా? శిల్పియొక్క భావము ఆ పనిముట్టు ద్వారా రాతిలోనికి చేరి విగ్రహం తయారవుతుంది.

అలాగే పెన్నుతో కాగితంపైన వ్రాస్తావు. ఆ గొప్పతనం పెన్నుదా? కాగితానిదా? లేక వ్రాసే నీ హస్తానిదా? ఇవేమీ కాదు. నీలోని భావం పెన్నుద్వారా కాగితంపైన అక్షరరూపంలో వెలువడుతుంది. కాగితంపైన అక్షరరూపంలో భావం దాగి ఉంది. ఆ భావన కన్పడుతుందా? దానికి రూపనామక్రియలు ఉన్నాయా? అదే పరమాత్మశక్తి. చదువు వచ్చిన వాడికి అక్షరాలు తెలుస్తాయిగాని మిగిలిన వారికి ఏం తెలుస్తాయి? అలాగే జ్ఞాని సర్వత్రా పరమాత్మని దర్శించగల్గుతాడు. కానివారికి ఆ విషయాన్ని చెప్తే నమ్ముతారా?" అన్నారు శ్రీబాబు.

## భక్తుడు జగన్మాతను చేరుకోవడానికి దారి కనిపెట్టండి



**గమనిక -**

**భగవంతుని చేరుకోవడానికి ఒకటి కంటే ఎక్కువ మార్గాలు ఉండవచ్చు**

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

# గురు పూర్ణిమ

"మామూలు చంద్రుడు కేవలం రాత్రి యొక్క చీకట్లని కొంత వరకూ బాపగలడు. అంతేగాక, ఆ చంద్రుడికి 15 రోజులు ఉచ్ఛదశ, 15 రోజులు క్షీణదశ వున్నవి. గ్రహణబాధ వున్నది. కానీ గురుచంద్రునికి ఎప్పుడూ ఉచ్ఛదశ గాని క్షీణదశ గాని లేదు. రాహుకేతుల నుండి గ్రహణ బాధ కూడా లేదు. గురుచంద్రుడు మానవుని హృదయంలో జన్మ జన్మాంతరాల నుండి పేరుకుని పోయిన అజ్ఞాన తిమిరాన్ని పటాపంచలు చేసి, జ్ఞాన రోచిస్సులు ప్రసరింపచేసి, మారనటువంటి, శాశ్వత ఆనందాన్ని ప్రసాదిస్తాడు. నిజమైనటువంటి సాధకుడే గురు పూర్ణిమ యొక్క విశిష్ఠతను అర్థం చేసుకుని ఆనందాన్ని పూర్ణతః అనుభవించ గలుగుతాడు.



"పుట్టినది మొదలు మార్పులు చెందుతూ చివరికి నాశనమయిపోయే యీ 'శవ' స్వరూపమైన దేహం నీ నిజ స్వరూపం కాదురా! మారిపోయే దేహంలోనే వుండి కూడా, మార్పు చెందకుండా, శాశ్వతమైన చైతన్యమేదయితే వుందో అది నీ అసలు స్వరూపంరా! అదే నీ నిజతత్వంరా" అని మనకి మన నిజ స్వరూపాన్ని తెలిపేటివారు గురుదేవులు. అటువంటి గురుదేవుని యందు విశ్వాసం ఆరూఢంగా వుంటే సాధకుడు తరించగలుగుతాడు.

**మన్నాథో - శ్రీజగనాథో। మద్గురో - జగద్గురో।**

**మమాత్మా సర్వ భూతాత్మా। తస్మై శ్రీ గురవేనమః** అని చెప్తోంది గురుగీత.

తనలో వున్న ఆత్మే – సర్వ భూతములలోనూ కూడా ప్రకాశిస్తోంది అని తెలుసుకున్న మానవుడు సర్వ భూతముల యందు, సర్వమానవాళి యందు సమభావము కలిగివుండి, సర్వులనూ ప్రేమించగలుగుతాడు. తన జీవితాన్ని సర్వమానవాళి యొక్క శ్రేయస్సుకై వినియోగించ గలుగుతాడు. అటువంటి పూర్ణ స్థితిని ప్రసాదించే సద్గురుదేవులు అఖండభక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండైశ్వర్య భోగభాగ్యములను, సుఖశాంతులను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించు గాక!

# యోగక్షేమం

- పాలూరి కాళీప్రసాద్

**అనన్యాశ్చిన్తయంతో మాం యే జనాః పర్యుపాసతే।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥** - భగవద్గీత 9-22

"ఎవరైతే అన్య చింతన లేకుండా నన్నే లెస్సగా ఉపాసిస్తూ నాయందే నిత్యం మనస్సును లగ్నం చేసి ఉంచుతారో వారి యోగక్షేమాన్ని నేను నా బాధ్యతగా వహిస్తాను" అని గీతాచార్యుడు అభయం ఇస్తున్నాడు. అయితే మనం సాధారణంగా తెలుగులో యోగక్షేమాలు అంటాం. యోగం అంటే కలయిక. మన దగ్గర లేనిదేదో కొత్తగా మనకు లభిస్తే దానిని యోగం అంటాం. ఉదాహరణకి ఒకడికి ధనయోగం ఉందనో రాజయోగం ఉందనో అంటే వాడి దగ్గర అప్పటివరకు లేని సంపదో, అధికారమో వాడికి అందుతుందని అర్థం. అలాగే మనకి దక్కుతుందని ఎంతగానో ఆశించినది చివరి నిముషంలో దక్కకపోతే మనకా యోగం లేదులే అని సరిపెట్టుకుంటాం.

అలాగే క్షేమం అంటే మన దగ్గర ఉన్నది మనకు దూరమై పోకుండా, ఎవరూ దోచుకోకుండా భద్రంగా మన దగ్గరే ఉండటం. ఎవరైనా దూర ప్రయాణానికి బయలుదేరుతుంటే "క్షేమంగా వెళ్ళి లాభంగా రండి" అంటాం. అంటే నీ దగ్గర ఉన్న ధనాన్ని కానీ, ఆభరణాలను కానీ, లేదా నీ కాళ్ళు చేతులు లాంటి అవయవాలను కానీ ఏమీ పోగొట్టుకోకుండా (క్షేమంగా) వెళ్ళి వీలైతే అనుకున్న పని పూర్తిచేసుకునో, లేదా ఉన్నదానికంటే మరింత సంపాదించో (లాభంగా) తిరిగి రమ్మని కోరుకుంటాం. ఇలా ఈ యోగక్షేమాలు రెండూ వేరువేరు అర్థాలు కల పదాలు.

అయితే మొన్న శ్రీ కాళీ వనాశ్రమ భాగ్యనగర శాఖలో జరిగిన సత్సంగాలలో శ్రీ మాతాజీ వారు పై గీతా శ్లోకాన్ని ప్రస్తావిస్తూ యోగక్షేమాలు రెండు కదా! మరి భగవానుడు ద్వివచన పదమైన **యోగక్షేమౌ** అనకుండా ఏకవచన పదమైన **యోగక్షేమం** అని ఎందుకు అన్నాడు? అని ప్రశ్నిస్తూ దానికి సమాధానంగా ఆయన ప్రసాదించేది క్షేమంతో కూడిన యోగం. అది ఒకటే కానీ రెండు కాదు అన్నారు. దీని మీద కొంచెం లోతుగా విచారిస్తే మనకు విషయం అర్థం అవుతుంది.

అంతవరకు మనది కానిది కొత్తగా మనకు లభించడం యోగం అని చెప్పుకున్నాం కదా. అయితే లోకంలో కొత్తగా వచ్చేవన్నీ ఎప్పుడో ఒకప్పటికి పోతాయి అని మనం చూస్తూనే ఉంటాం. మన కళ్ళముందే ఎందరో ఉన్నట్టుండి ధనవంతులుగా మారడం, మరికొంత కాలానికి ఆ వచ్చిన ధనాన్ని నిలబెట్టుకోలేక మళ్ళీ బికారులుగా మారడం మనకు తెలుసు. అలాగే మనం చిన్నప్పుడు చదువుకున్న చదువులో ఎంతవరకు మనకు గుర్తుంది? ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకోకపోతే అది మన

స్మృతిపథంనుండి దూరమైపోతుంది. అంతెందుకు ఒకప్పుడు లేకుండా ఫలానా తేదీన పుట్టిన మనందరం మరో తేదీన లేకుండా పోతాం కదా! కాబట్టి కొత్తగా మనకు వచ్చేదేదీ శాశ్వతంగా మనతో ఉండదని అర్థం అవుతోంది. అందుకే ఈ ప్రాపంచిక విషయాలన్నింటిలో యోగక్షేమాలు రెండూ వేరు వేరే. యోగంతో వచ్చినది క్షేమంగా ఉంటుందని నమ్మకం లేదు. మరి క్షేమంతో కూడిన యోగం అంటే ఏమిటి? ఎప్పటికీ మననుంచి దూరమైపోకుండా వుండేది ఏది? అంటే అది సనాతనంగా మనదై ఉన్న మన నిజస్థితి మాత్రమే. అది ఈ శరీరానికో మనస్సుకో పరిమితమైనది కాదు. అది సర్వవ్యాపకమైన ఆత్మతత్త్వం. అదే మన నిజతత్త్వం.

**న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః।**
**యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ॥** భ. గీ. 15-6

"ఎక్కడైతే సూర్యచంద్రుల ప్రకాశం, అగ్నిదేవుని ప్రకాశం కూడా వెలవెలబోతుందో, ఏ పదాన్ని పొందిన తరువాత ఇక తిరిగి రావడం ఉండదో అదే నాయొక్క పరమపదం" అని పరమాత్మ చెబుతున్నాడు. అదే మన నిజస్థితి. మనం మన ఇల్లు దాటి బయట ఎక్కడికైనా వెళ్ళాము అంటే తిరిగి వచ్చేస్తామనే అర్థం కదా. అలాగే ఒక చోట ఏ సత్సంగానికో, పూజకో, లేక సినిమాకో ఒక వందమంది వచ్చారంటే అది అయిపోగానే అందరూ తిరిగి వాళ్ళ వాళ్ళ స్వస్థలానికి వెళ్ళిపోతారు కదా! అసలు మన సొంతం అనుకున్న ఇల్లే ఎన్నాళ్ళు మనతో ఉంటుందో తెలియదు. ఒకవేళ అది వున్నా అందులో మనం ఉండటానికి ఎన్నాళ్ళు ఈ దేహంలో ప్రాణం ఉంటుందో తెలియదు. ఒక్కసారి ప్రాణం పోగానే ముందు మన దేహాన్ని ఇంటి బయట పెట్టేస్తారు.

కాబట్టి సృష్టిలో మనకు కనిపించే ప్రతీదీ వచ్చిపోయేదే. మరి ఒకసారి వస్తే మళ్ళీ పోని ఆ యోగక్షేమం ఏమిటి? అదే జ్ఞానం. మనం జ్ఞాన స్వరూపులమే అయి వున్నాం. అయితే నిప్పుని పొగ క్రమ్మినట్లు మన జ్ఞానాన్ని అజ్ఞానమనే పొర కప్పివేస్తోంది. వయసు పెరుగుతున్నకొద్దీ మన కళ్ళకు పొరలు క్రమ్మి క్రమంగా మన చూపు మందగిస్తుంది కదా. ఒకసారి నేత్రవైద్యుడు ఆ పొరను తొలగిస్తే ఇక అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. అలాగే జన్మజన్మల నుండి మన జ్ఞాననేత్రాన్ని కప్పి ఉంచిన అజ్ఞాన పొరను గురుదేవులు తొలగిస్తే ఇక మళ్ళీ ఆ పొర క్రమ్ముకోదు. ఒకసారి జ్ఞానాన్ని పొందినవాడు మళ్ళీ అజ్ఞాని కాలేడు. ఇదే నిజమైన యోగక్షేమం.

ఈ విషయాన్నే వివరిస్తూ శ్రీగురుదేవులు కొన్ని ఉదాహరణలు చెప్పేవారు. ఒకసారి తెల్లబడిన జుట్టు మళ్ళీ నల్లబడదు కదా! జుట్టులోని అసలు రంగు తెలుపే. దానిపైన నలుపు ఆవరించింది. ఒకసారి ఆ నలుపు పొర తొలగిపోతే మళ్ళీ రాదు. అలాగే ఒకసారి పండిన పండు మళ్ళీ పచ్చిగా మారలేదు. విత్తనం పచ్చిగా వున్నంత

వరకూ దానిలో మొలకెత్తే లక్షణం ఉంటుంది. అది మళ్ళీ మళ్ళీ అనేక వృక్షాలుగా విస్తరిస్తుంది. అదే విత్తనం ఒకసారి కాలిపోతే ఇక మళ్ళీ మొలకెత్తే అవకాశమే లేదు. అలా జ్ఞానాగ్నిలో మన కర్మబీజాలు, వాసనాబీజాలు అన్నీ కాలిపోతే ఇక మళ్ళీ మనం అజ్ఞానంలో పడి తిరిగి జన్మనెత్తవలసిన అవసరం లేదు.

అజ్ఞానంలో ఉన్నవాడి జన్మలు వాడి ఇష్టానుసారం రావు. వాడి కర్మలను అనుభవించడానికి వీలైన శరీరమే వాడికి లభిస్తుంది. వాడు ఆ జన్మకు బద్ధుడై వుంటాడు. అదే జ్ఞాని అయినవానికి ఈ బంధనం లేదు. జన్మ ఎత్తవలసిన అవసరం లేకపోయినా భగవదాజ్ఞను అనుసరించి లోకోపకృతికి ఒకవేళ అతను జన్మించినా అది బంధనం కాదు. పైగా ఇతరులకు కూడా మోక్షదాయకం అవుతుంది. గోతిలో పడ్డ వాడికి, వాడిని పైకి లాగటం కోసం ఆ గోతిలోనే దిగిన వానికి ఎంత తేడా ఉందో వీరిద్దరి జన్మలకు అంత తేడా ఉంది. ఒకరిది జన్మ, మరొకరిది అవతారం. అవతారం అంటే క్రిందకు దిగడం. ఇది జారి పడిపోవడం కాదు. ఇతరులను పైకి లాగడానికి తనంత తానుగా క్రిందకు దిగడం. శరీరం క్రింద ఉన్నా తాను మాత్రం ఎప్పుడూ అత్యున్నతమైన తన నిజస్థితిలోనే ఉంటాడు.

అటువంటి నిజమైన యోగక్షేమాన్ని పొందాలంటే భగవానుడు చెప్పినట్లుగా ఇతర చింతనలు మాని నిత్య భగవన్నామ స్మరణలో, ఉపాసనలో, ధ్యానంలో, విచారణలో మన మనస్సుని ఊరబెట్టాలి. ఒక్కసారి అటువంటి బ్రాహ్మీస్థితిని పొందామంటే ఇక మన మనస్సు ఎటువంటి ప్రాపంచిక వ్యామోహాలకు లోనుకాదు.

**ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి।**
**స్థిత్వా స్యామంతకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి॥** భ. గీ. 2-72

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***అక్టోబర్ 2025 :*** AS 2231, 6750, 6867, 7183, 7908, 8327, 8363, 9260, 9290, PK 0105, 0106

***నవంబర్ 2025 :*** AS 9263

# సర్వ చైతన్య రూపామ్

- సన్నిధానం కాళీమాత

శ్రీ శంకర భగవత్పాదులవారు సౌందర్యలహరిలో అమ్మవారిని ఒక కొత్త రకమైన శబ్దంతో సంబోధించడం జరిగింది. **'పురుషికా!'** అని. సాధారణంగా పురుష శబ్దం, బాలికా శబ్దం మనకు పరిచయమైనవే. కాని ఈ సంబోధనలో ఒక పౌరుష రూపమైన, ధీరత్వం కలిగిన స్త్రీగా అనిపిస్తుంది. శబ్దంలో ప్రతిఫలించే అర్థం మాత్రమే కాక, అంతర్గతంగా అర్థం చేసుకుంటే సర్వజీవులలో వుండే సమర్థవంతమైన క్రియాశక్తిగా తెలియబడుతుంది. శ్రీదేవీ భాగవతంలో చెప్పిన **'సర్వ చైతన్య రూపిణి'**గా తెలుస్తుంది.

మనకు జగజ్జనని కనక దుర్గగా, కాళీమాతగా, కాత్యాయనిగా, సప్తమాతృకలుగా, అష్టలక్ష్ములుగా, దశమహావిద్యలుగా అనేక బాహ్య రూపాలలో వర్ణించుకున్నా, మన మనస్సుకు నచ్చిన రూపంలో మనం కొలుచుకున్నా, అమ్మశక్తి ఆ యా రూపాలకు సంబంధించిన శక్తిగా మాత్రమే పరిమితం కాక, సర్వ జీవులకు చైతన్యము నిచ్చే నిర్గుణ శక్తిగా తెలియబడుతోంది. పిపిలీకాది బ్రహ్మ పర్యంతం సమస్త జీవరాశిలోని చైతన్యం అమ్మే కదా!

అంతేకాక, ఆవిడ **ఆద్య**. అంటే అన్నిటికంటే, సృష్టి ప్రారంభమునకు కూడా ఆదిలో వున్న శక్తి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు పూర్వమే వున్న శక్తి. అంతేకాక త్రిమూర్తులలో వున్న చైతన్యం కూడా ఆ జగజ్జననియే. విద్యా స్వరూపిణిగా వుండి విషయ పరిజ్ఞానాన్ని ఇచ్చునది ఈ మహాశక్తి. విద్య అనగా బాహ్య పరిజ్ఞానము అని మాత్రమే కాక, **'ఆధ్యాత్మ విద్య'** అని మనం గ్రహించాలి. అంటే ఉపాధి కారకముగా వుండే భౌతిక విద్య మాత్రమే కాక, స్వస్వరూప జ్ఞానమును తెలియజేయు ఆత్మ విద్యను సులభముగా, అనాయాసముగా తెలియజేయు సరస్వతీ స్వరూపిణి. మన బుద్ధి వక్రమార్గంలో వెళ్ళకుండా తనని నమ్మి ప్రార్థించిన వారిని సత్యమార్గములో నడిపించి, సర్వ ఉత్కృష్టమైన స్థానమునకు చేర్చు మాత.

శ్రీ త్రైలింగ స్వామి తమ శిష్యునకు జగన్మాత దర్శనం చేయించిన నిదర్శనం మనకు ఆ మాత యొక్క సర్వ చైతన్య

రూపమునకు ప్రత్యక్ష సాక్షిగా తెలుస్తుంది. కలకత్తా నుండి వచ్చిన తన శిష్యునకు త్రైలింగస్వామి కాశీలోని వారి ఆశ్రమంలో ప్రత్యక్షంగా కాళీమాత దర్శనం చేయించారు. శిలా రూపంలో వున్న అమ్మవారు చైతన్యరూపంలో తన ముందు నిలవడం, తాను అమ్మ పాదాలు తాకి, జీవంతో వున్న పాదాల స్పర్శను పొందటం తన ప్రత్యక్ష అనుభవంగా ఆ శిష్యుడు రాసిన '**శ్రీ త్రిలింగ స్వామి జీవిత చరిత్ర**' లో మనకు తెలుస్తుంది. 'శిలామూర్తి ఎలా చైతన్యవంతమైనది?' అని శిష్యుడు అడిగిన ప్రశ్నకు స్వామి ఇలా సామాధానమిచ్చారు.

జడమైన శరీరంలో చైతన్యం అమ్మ దయ కదా! అదే చైతన్యం శిలా మూర్తిలో ప్రవేశపెట్టిన అది కూడా మనవలే జీవంతో దర్శనం ఇవ్వగలదు. ప్రతి జీవిలోనూ చైతన్య శక్తిగా వున్న ఆ జగజ్జనని అంతః సాక్షిగా వుండి, మానవుల పాప పుణ్యాలకు తగిన కర్మఫలాలను ఇస్తూ, బంధమోక్షాలకు కారణమై వుంది. మానవులకు ఇది తెలియక తమ కర్మలకు సాక్షిని గుర్తించక, అహంకారముతో జన్మ పరంపరలకు లోనవుతున్నారు.

సనాతన ధర్మం ఈ కర్మఫలాలను విశదీకరిస్తే, బుద్ధ భగవానుడు అర్థం చేసుకున్నవారు కనుక కర్మ చేయని సంకల్పాలు కూడా అంటే కోరికలే దుఃఖానికి కారణం అని చెప్పారు. అనగా శ్రీ బాబూజీ మహరాజ్‌వారు మనకు విశదీకరించినట్లుగా ఒక్క సంకల్పం అది సత్ అయినా, దుష్టమైనా జన్మ పరంపరలకు కారణం అవుతుంది.

పూర్వజన్మ పరంపరలతో కూడిన వాసనలు కలిగిన జీవుల బుద్ధి వక్రమార్గము నందు వెళ్ళకుండా అంతఃశక్తిగా వున్న చైతన్య రూప జగన్మాతను శరణువేడి బంధవిముక్తుల మగుదుము గాక!

**సర్వ మతాల సారం ఒక్కటే. ఆచారాలు వేరైనా ఆంతర్యం ఒక్కటే. దారులు వేరైనా గమ్యం ఒక్కటే. అయితే భక్తి, కర్మ, జ్ఞాన మార్గాల ద్వారానే ఆధ్యాత్మిక భావబీజాలు సులువుగా అంకురిస్తాయి. సత్వర ఫలితాల నిస్తాయి.**

- శ్రీ బాబు

# కొప్పు లింగేశ్వరుడు

- పళని

దాక్షారామ దేవాలయాలలో పలివెల కొప్పులింగేశ్వరాలయం ముఖ్యమైనది. మొదట్లో ఈ కొప్పులింగేశ్వరుణ్ణి 'అగస్త్యేశ్వరుడు' అని పిలిచేవారు. అంటే అగస్త్యమహర్షి ప్రతిష్ఠించిన లింగమే అగస్త్యేశ్వరుడు. ఆ తరువాత ఒక పరమ అద్భుతమహిమ వల్ల ఈ అగస్త్యేశ్వరునికి కొప్పు లింగేశ్వరుడు అనే పేరు వచ్చింది.

ఆ ఆలయంలో ఒక పూజారి ఉండేవాడు. అతడు యువకుడు. ఎంతటి భక్తుడో అంతటి వేశ్యాలోలుడు. ఇతని వేశ్యాలోలత్వం ఆ ఊరి ప్రజలకు సహింపరానిదిగా అయింది. ఎలాగైనా సరే అతనిని దేవాలయంలో నుండి బయటకు పంపాలని నిర్ణయించుకున్నారు. కాకపోతే వేశ్యాదాసుడు, ఈశ్వరదాసుడిగా ఎలా ఉంటాడు?

పెద్దలు అతనిని అనేక విధాలుగా మందలించారు. బుద్ధులు చెప్పారు. కాని ప్రయోజనం లేకపోయింది. ఇక ఆ రాజుగారికి ఫిర్యాదు చేశారు. ఇతణ్ణి శిక్షించవలసినదని అర్థించారు.

ఒకరోజు మధ్యాహ్నం హఠాత్తుగా రాజుగారు అగస్త్యేశ్వర స్వామి దర్శనానికి వచ్చారు. సరిగా ఆ సమయంలో ఆ పూజారి గృహంలో వేశ్యతో ముచ్చటలాడుతున్నాడు. ఈలోగా రాజుగారు వచ్చారనే వార్తను విని ఖంగారు పడ్డాడు. సాంప్రదాయాన్ని అనుసరించి, రాజుగారికి ఈశ్వరునికి అలంకరించిన మాలను సమర్పించాలి. దీనినే నిర్మాల్యం అంటారు. ఆలయంలో ఈశ్వరుడికి మాల ఉన్నదో లేదో అనే అనుమానం వచ్చి, వేశ్య కొప్పున ఉన్న మాలనే తీసుకుని దేవాలయానికి పరుగెత్తాడు.

రాజుగారికి ఆలయ మర్యాదలుచేసి, పరమేశ్వరుని పాదుకలు ఆయన తలపై పెట్టి, ఈ మాలను ఆయన చేతిలో పెట్టాడు. చుట్టూ ఉన్న ప్రజలు నిర్మాల్యాన్ని జాగ్రత్తగా పరిశీలించారు. దొంగ దొరికి పోయాడు! ఆ మాలలో ఒక పొడవైన వెంట్రుక ఉన్నది. వెంటనే వారంతా కలిసి "ఇదిగో చూడండి! ఇది ఈశ్వరుడు ధరించిన మాల కాదు, వేశ్య ధరించినది. కాకపోతే ఈ మాలలో ఈ పొడవైన వెంట్రుక ఎలా వస్తుంది?" అని ప్రజలు ప్రశ్నలవర్షం కురిపించారు.

రాజు ఆ పూజారి వంక ఉగ్రంగా చూస్తూ "దీనికి నీ సమాధానం ఏమిటి?" అని ప్రశ్నించాడు. దానికి ఆ పూజారి "మహారాజా! ఇది నిజంగా ఈశ్వరుడి మాలే. సందేహం లేదు. మన ఈశ్వరుడు కొప్పలింగేశ్వరుడు. ఆయనకు పెద్ద జడ ఉంది. ఆ జడలోని వెంట్రుక ఇది. ఈశ్వరుడు ధూర్జటి కదా!" అన్నాడు. రాజుతో సహా అందరూ ఆశ్చర్యపోయారు! 'ఏమి దుస్సాహసం!' అన్నారు. 'అలా అయితే ఇప్పుడే ఈశ్వరుడి కొప్ప చూపించు' అని రాజు ఆజ్ఞాపించాడు.

"రాజా! ఈశ్వరుడికి అభిషేకంచేసి, గంధపుష్పాదులతో పూజించి, నాగాభరణ భూషితుణ్ణి చేశాను. ఇప్పుడు స్వామిని తాకటానికి కుదరదు. రేపు ఉదయం నిర్మాల్యం తీసేవరకు మీరు వేచి ఉండవలసిదే" అన్నాడు పూజారి. రాజు అసలు విషయం తేల్చుకోవాలని 'సరే' అన్నాడు. మరునాటి ఉదయం ప్రజలంతా జన సముద్రంలా పోగయ్యారు.

పూజారి మెల్లగా నాగాభరణం, నిర్మాల్యం తొలగించి ఈశ్వరుడి నిజరూపాన్ని చూపించాడు. ఆశ్చర్యం! పరమేశ్వరుని శిరస్సుపై పెద్దజడ ఉంది. అర్చకుడి నేత్రాలు ఆనంద ప్రవాహాలు! రాజుతో సహా ప్రజలంతా ఆశ్చర్య సముద్రంలో మునిగి తేలారు! వెంటనే "ఇదంతా దగా! కుట్ర! మోసం! రాత్రికి రాత్రి ఈశ్వరుడికి జడ అతికించాడు" అంటూ ప్రజలు అరుపులు కేకలు పెట్టసాగారు. రాజు మెల్లగా గర్భగుడిలో ప్రవేశించి, పరీక్షించటానికి వెంట్రుక పట్టుకు లాగాడు. రక్తం చిమ్మింది. ఆ క్షణంలోనే రాజుగారికి కంటి చూపు పోయింది.

వెంటనే మహారాజు "ఈశ్వరా! నా ఈ అపరాధాన్ని మన్నించు. ఈ పూజారి పరమభక్తుడు!" అంటూ అర్థించాడు. ఈశ్వరానుగ్రహంతో రాజుగారికి వెంటనే చూపు వచ్చింది.

నిజానికి అగస్త్యేశ్వరుడు కొప్పలింగేశ్వరుడు కాదు. ఆయనకు శిరస్సుపై జడలేదు. ఆ రాత్రి పూజారి తనను రక్షించవలసినదని, నెత్తిపై కొప్ప తెప్పించుకోవలసినదిగా ప్రార్థించాడు పరమేశ్వరుణ్ణి. ఆ భక్తవత్సలుడు అర్ధనారీశ్వరుడు, తన భక్తుణ్ణి కాపాడటానికి కొప్పలింగేశ్వరుడు అయ్యాడు. ఆ రాజు 30 పుట్ల భూమిని దానం చేశాడు. ఈ భూమి ఇప్పటికీ 'జుత్తిగపాడు' అనే పేరుతో పిలవబడుతోంది.

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

గీతను యుద్ధభూమిలో ఎందుకు బోధించవలసి వచ్చింది? ఇది సాధ్యమా? అని కొందరు అంటారు. ఒక్క యుద్ధభూమి అనేకాదు. ఆకాంక్షకు, ఆసక్తికి సంఘర్షణ ఎక్కడ జరిగినా, గీతాబోధ జ్ఞానాన్ని ప్రసాదించి, ఆ అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేస్తుంది. అహంకార మమకారాలు, కర్తృత్వ - భోక్తృత్వాలు, ఆసక్తికి మూలస్తంభాలు. సుఖ, దుఃఖ రూపమైన ద్వంద్వములు, శోకము, మోహము మొదలైన వాటి వల్ల వుద్భవించే వికారాలు, ఆ ఆసక్తి ప్రకటం కావటానికి దోహదం చేస్తాయి. ఆసక్తి వల్ల ఎప్పుడైతే నీవు నీ స్వధర్మాచరణాన్ని వీడినవాడివి అవుతావో, అప్పుడే నీవు నీ లక్ష్యాన్ని పోగొట్టుకున్న వాడివి అవుతావు.



యుద్ధార్థియై రణరంగానికి వచ్చిన అర్జునుడు స్వజన హత్యా పాతకానికి వెరచి, శోకమోహములకు లోనై, కిం కర్తవ్యతా మూఢుడై, శ్రీకృష్ణ భగవానుణ్ణి శరణుజొచ్చి, తనకు శ్రేయోదాయకమైన మార్గాన్ని బోధించమని వేడుకున్నాడు. ఇక్కడ కొద్దిగా అర్జునుడి వాదాలను పరిశీలించు. మొదటిది తాను స్వజనమును చంపితే ఇహపరములకు చెడిపోతాను అనేది. అందులో తాను చంపేవాడు అన్న అహంకారం, చంపబడేవారు తనవారు అన్న మమకారము, చంపినందు వలన ఇహపరములందు కలుగబోవు ఫలితములను గురించిన ఆవేదన అన్నీ ఉన్నాయి. సంసారం అనే విషవృక్షం మొలకెత్తటానికి ఈ అహంకార మమకారాలు, కర్తృత్వ- భోక్తృత్వాహంకారము, భోక్త - భోగ్య భావనలే బీజాలు. ఈ కర్తృత్వ- భోక్తృత్వాభిమానం అజ్ఞానం వల్ల జనించి, జీవుణ్ణి మోహంలో ముంచి, శోకాన్ని కలిగిస్తుంది. ఈ శోకం పోవాలి అంటే మోహం పోవాలి. మోహం పోవాలి అంటే, అందుకు కారణమైన అజ్ఞానం తొలగింపబడాలి. అజ్ఞానం జ్ఞానం వలన గాని నశించదు. కనుకనే, శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడికి జ్ఞానోపదేశం చేసి ఆ జ్ఞానాన్ని ఆశ్రయించి జీవితాన్ని ఎలా దిద్దుకోవాలో బోధించాడు.

ఇక్కడ కొంచెం జాగ్రత్తగా గమనిస్తే, శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడు అడిగిన మొదటి ప్రశ్నకు సమాధానం చెప్పనేలేదు అని

తెలుస్తుంది. అర్జునుడి ప్రశ్నలు ఎటువంటివి అంటే, అవి వ్యాధి లక్షణాల వంటివి మాత్రమే. అసలు అర్జునుడి నిజమైన వ్యాధి సంసారాసక్తి. వ్యాధి లక్షణాలు తగ్గినంత మాత్రాన, వ్యాధి నిర్మూలనం అయినట్లు కాదు. కాని వ్యాధిని నిర్మూలిస్తే వ్యాధితో పాటు దాని లక్షణాలు కూడ అవే నిర్మూలింప బడతాయి. అందువల్ల శ్రీకృష్ణ భగవానుడు తన బోధ చేత మూల కారణమైన అజ్ఞానాన్ని తొలగించాడు. ఆ కారణం వల్లనే అర్జునుడు కూడా "నా ప్రశ్నలకు సమాధానం చెప్పలేదేమి?" అని శ్రీకృష్ణ భగవానుణ్ణి అడగలేదు. అర్జునుడిలో ఆధ్యాత్మిక చింతన, జిజ్ఞాస లేకపోయి ఉంటే, ఆతడు "కృష్ణా! ఇదేమిటి? జ్ఞానము, అజ్ఞానము అని, ఆత్మ అని ఏమిటేమిటో అంటున్నావు. అదంతా నాకు తెలియదు. ప్రస్తుతము యుద్ధం చేయటానికి నేను చేయవలసింది ఏమిటో చెప్పు" అని అడిగి ఉండేవాడు. కాని అర్జునుడిలో జిజ్ఞాస ఉన్నది. అలాగే ఆసక్తి కూడా వున్నది. ఆసక్తి ఉన్నప్పుడు చేసే సాధన చిల్లులు ఉన్న కుండను నీటితో నింపటానికి చేసే ప్రయత్నం వంటిది. ఆ సాధన ఫలించదు. ఆసక్తికి మూలమైన అజ్ఞానం, జ్ఞానం ద్వారా నశిస్తే గాని నీ సాధన ఫలించదు.

నీలో ఆధ్యాత్మిక పరమైన ఉదాత్తమైన ఆశయాలు ఎలా వున్నాయో అలాగే వాటి కనుగుణంగా, భగవత్సాక్షాత్కారం కోసం నీకు చేతనైనంత సాధన నీవు చేస్తూ ఉంటావు. కాని నిన్ను సంసారానికి లేదా జగత్తుకు బంధిస్తూ ఉన్న బంధాలు ఇంకా అలానే ఉన్నాయి. వాటి వలన అహంకార మమకారాలు, వాటి నుండి తల్లి, తండ్రి, సోదరులు, నావారు అన్న భావన మొదలైనవన్నీ ఉద్భవిస్తాయి. సహజంగానే నీకు ఈ బాంధవ్యం పట్ల ఆకర్షణ, సంగం కలుగుతాయి. ఈ సంగదోషమే నీ ఆధ్యాత్మిక సాధనకు అడ్డం వస్తుంది. అర్జునుడి పరిస్థితి కూడా సరిగ్గా అలాగే ఉన్నది. ఈ విధంగా చూచినప్పుడు, అర్జునుడికి కలిగినది కేవలం అజ్ఞానాంధకార జనితమైన ఆధ్యాత్మిక సమస్య మాత్రమే అని స్పష్టంగా తెలుస్తుంది. అర్జునుడిలో సత్యాన్ని దర్శించాలి అన్న ఆకాంక్ష, తృష్ణ, ఆధ్యాత్మిక దాహం, పుష్కలంగా ఉన్నాయి. అందువల్లనే శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడి పాత్రను గుర్తించి, అతనికి బ్రహ్మ విద్య అయిన గీతామృతాన్ని ప్రసాదించాడు. నీ జీవితంలో కూడ సామాన్యంగా ఇటువంటి సమస్యలు ఎదురవుతూనే ఉంటాయి. అందువలననే గీత నీకు జ్ఞానం పొందటానికి మార్గదర్శకము, అత్యంత పఠనీయము, అభ్యాసయోగ్యము అవుతున్నది.

- సశేషం

# నరసింహ మెహతా

సేకరణ - మురళి

నర్సింహ మెహతా (సుమారు 1414 -1493) 15వ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ కవి, భక్తుడు. ఆయనను గుజరాతీ భక్తి సాహిత్యంలో ఆదికవిగా గుర్తిస్తారు. ఆయన అత్యంత భక్తితో శ్రీకృష్ణుడిపై వేలాది భజనలను రచించడంలో ప్రసిద్ధుడు. నర్సింహ మెహతా, ప్రస్తుత గుజరాత్ భావనగర్ జిల్లాలోని గోపనాథ్ అనే గ్రామంలో నాగర్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి రాజ్య కార్యదర్శిగా పనిచేశారు. నర్సింహ తల్లిదండ్రులు చిన్నప్పడే మరణించడంతో ఆయన పెద్దన్న బన్సీధర్, వదినల వద్ద పెరిగాడు.

నర్సింహ ఎనిమిదేళ్ల వయస్సు వచ్చే వరకు మౌనంగా వుండేవారు. ఒక దివ్య పురుషుని అనుగ్రహంతో మాటలు వచ్చాయి. మొట్టమొదట "రాధేశ్యామ్" అని పలకగలిగాడు. వదిన గారు నర్శింహను ఆదరించకుండా అనేక కష్టాలు పెట్టేది. ఆమె పెట్టే బాధలకు తట్టుకోలేక నర్సింహ ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. అలా వెళ్ళి ఒక అడవి చేరుకుకుని, అక్కడి గోపనాథ మహాదేవ ఆలయం వద్దకు చేరుకున్నాడు. అడవిలో తినటానికి ఏమీ దొరకలేదు. నిద్రాహారాలు మాని ఏడురోజులు ఉపవాసం చేసి శివుని గురించి ధ్యానం చేశాడు.

భక్త సులభుడైన శివుడు సంతోషించి ప్రత్యక్షమయ్యాడు. నర్సింహను బృందావనానికి తీసుకెళ్ళి కృష్ణ దర్శనం చేయించాడు. బృందావనంలో శ్రీకృష్ణుని నిజరూప దర్శనం పొంది శ్రీకృష్ణుని రాసలీల చూసిన నర్సింహ, శ్రీకృష్ణుడిని తిలకిస్తూ భక్తి గానామృతంలో మునిగి పోయేవాడు. బృందావనం వదలి రాలేకపోయాడు. కొంతకాలం తరువాత ఆయన గ్రామానికి తిరిగి వచ్చి తన వదినకు నమస్కరించి కృతజ్ఞతలు తెలిపాడు. తను పెట్టిన బాధలు, అవమానమే తన భక్తి మార్గానికి మార్గదర్శకమైందని చెప్పాడు.

నర్సింహ జూనాగఢ్‌లో తన భార్య మరియు ఇద్దరు పిల్లలతో కలిసి నివసించేవాడు. అతని కుమారుడు శామల్దాస్ మరియు కూతురు కుంవర్‌బాయి. నర్సింహ కుల మత వర్గ వివక్ష లేకుండా

అందరితో కలిసి కృష్ణుడిని స్తుతిస్తూ పాడటం మరియు నృత్యం చేయడంతో అతను వాగ్గేయకారుడిగా ప్రజాదరణ పొందాడు. అప్పటి నాగర్ బ్రాహ్మణులు శివభక్తులు, మరియు కృష్ణభక్తి పట్ల వ్యతిరేకత కలిగినవారు. నాగర్ బ్రాహ్మణులు తమను తాము "ఉన్నత హోదా"గా భావించే వారు మరియు వారి మర్యాదలు, సంగీత నైపుణ్యాలు మరియు ఆస్థాన నియామకాలకు ప్రసిద్ధి చెందినందు వలన వారు ఉన్నత కులస్థులమనే గర్వంతో ఉండేవారు. ఆ సమయంలో చాలా మంది నాగర్ బ్రాహ్మణులు శివుడిని ఆరాధించేవారు మరియు ఇది కృష్ణ భక్తుడైన నరసింహ్‌ను వ్యతిరేకించడానికి, హింసించడానికి దోహద పడింది. వారు నర్సింహ కుటుంబాన్ని తమతో కలవనివ్వకపోగా ఎటువంటి సహాయాన్ని అందనిచ్చేవారు కాదు.

మదన్ మెహతా అనే ధనికుని కుటుంబ పూజారి, మదన్ మెహతా కుమార్తెకు తగిన జీవిత భాగస్వామిని వెతుక్కుంటూ జునాగఢ్ వచ్చాడు. స్థానిక నాగర్ బ్రాహ్మణులు, నర్సింహ్ కుమారుడు శ్యామల్‌దాస్‌ను కలవమని పూజారికి సూచించారు. పూజారి నరసింహ పేదరికాన్ని అపహాస్యం చేస్తాడని మరియు ఈ వార్తను ఇతర పట్టణాలకు వ్యాప్తి చేస్తే నరసింహ మరింత అపహాస్యం పాలవుతాడని ఆశించారు. అయితే, పూజారి శ్యామల్‌దాస్‌తో వివాహానికి ఆమోదాన్ని తెలియ పరచాడు. నరసింహ కృష్ణుడిని వివాహానికి ఆహ్వానించాడు. ఇతర బ్రాహ్మణులు అతని పేదరికాన్ని ఎగతాళి చేస్తూ, కృష్ణుడు సహాయం చేస్తాడా అని అపహాస్యం చేశారు.

తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులతో నిండిన శామల్‌దాస్ వివాహ బృందం జునాగఢ్ నుండి బయలుదేరి వెళ్ళి వైభవంగా జరిగిన వివాహ వేడుకలో పాల్గొని, అందరి అంచనాలకు మించి చాలా వైభవంగా తిరిగి వచ్చారు. వివాహ వైభవాన్ని చూసి మిగిలిన బ్రాహ్మణులు అసూయ చెందారు. శామల్‌దాస్ వివాహం వైభవంగా జరుగటకు శ్రీకృష్ణుడే కారణమని బ్రాహ్మణులకు అర్థమయ్యింది.

- సశేషం

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**61. ఓం నిరస్త దురిత స్తోమాయ నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన శిష్యులయొక్క సమస్త పాపాల, శాపాల యొక్క రాశిని నాశనం చేసి వారిని శుద్ధ స్ఫటికాలుగా ప్రకాశింపచేసే శక్తి కలవారు. అగ్నిలో వేసిన వస్తువుల యొక్క మలినాలన్నీ హరించి శుద్ధమైన భస్మంగా మారినట్లు శ్రీగురుదేవులను ఆశ్రయించిన వారి కలుషాలన్నీ హరించి శుద్ధ సత్వ గుణంతో ప్రకాశిస్తారు.

**62. ఓం నిత్యానందాయ నమః**

శ్రీ గురుదేవులు సదా ఆనందమయ స్వరూపులు. వారే కాక వారిని ఆశ్రయించిన వారికి కూడా నిత్య, సత్యమైన ఆనందాన్ని ప్రసాదిస్తారు. మనం అనుభవించే ప్రాపంచిక ఆనందాలన్నిటి వెనుక దుఃఖం దాగి ఉన్నది. ఆత్మానందం మాత్రమే నిత్యమైనది. శ్రీగురుదేవులు ఎల్లప్పుడూ అటువంటి ఆత్మానందంలో ఓలలాడుతూ తమను ఆశ్రయించిన వారిని కూడా అందులో ముంచి తేలుస్తారు.

**63. ఓం నిరంకుశాయ నమః**

దుష్టశిక్షణ,శిష్టరక్షణ ధ్యేయసాధనలో వారు నిరంకుశులు. తమ నాశ్రయించిన వారిలో దాగియున్న అరిషడ్వర్గములను అంతమొందించే విషయములోను, వారిలోని అహంకార మమకారపు పొరలను తొలగించి, భేదబుద్ధిని నశింపజేసి వారిని సత్యం, శాంతి, దయ, ప్రేమ స్వరూపులుగా మార్చే ప్రయత్నంలోను వారు నిరంకుశులు, కఠినులు, ఈ లక్ష్యసాధనలో వారిని ఈ ప్రపంచములో ఏ శక్తి అదుపు చేయలేదు. ప్రపంచములోని సర్వ శక్తులకు ఆధారభూతమైన సర్వ శక్తిమంతులైన శ్రీగురుదేవుని నిరోధించగల శక్తి ఏదీ లేదు.

**64. ఓం సమున్నత దయా సింధవే నమః**

శ్రీగురుదేవుల దయ అపారమైనది. ఉన్నతమైనది. సముద్రానికైనా పరిధి ఉంది కానీ వారి దయకు ఎల్లలు లేవు. సృష్టి లోని సమస్త ప్రాణులు వారి దయకు పాత్రులే. ఆఖరికి వారిని తమ శత్రువుగా భావించే వారిపై కూడా వారు దయనే చూపిస్తారు.

**65. ఓం సమర్థాయ నమః**

శ్రీగురుదేవులు సర్వ సమర్థులు. వారికి సాధ్యం కానిది ఏదీ లేదు. వారికి వారే

సాటి. త్రిమూర్తులకు కూడా సాధ్యంకాని పనులను శ్రీగురుదేవులు సంకల్ప మాత్రం చేతనే సాధించగలరు. తమనాశ్రయించిన వారిని కూడ తమంతటి వారిగా చేయగల సర్వసమర్థులు శ్రీసద్గురుదేవులు ఒక్కరే.

**66. ఓం సాధు పుంగవాయ నమః**

సాధు మహాత్ములందరు యే సత్యమును తెలుసుకొనుటకై అహర్నిశలు సాధన చేస్తారో ఆ సత్యమునకు మూలము శ్రీగురుతత్త్వము. అట్టి సాధుమహాత్ములకు మార్గదర్శకత్వము నెఱపుటకై సాకారులై శ్రీగురుదేవులుగా అవతరించి సాధు శ్రేష్ఠులుగా కీర్తింపబడినారు.

**67. ఓం సమస్త లోక కళ్యాణ గుణాలంకార భాసురాయ నమః**

శ్రీగురుదేవులు సమస్తమైన కళ్యాణ గుణములతో ప్రకాశించే వారు. లోకంలో అందరికీ ఆదర్శమూర్తులై ప్రకాశించే వారు. శ్రీగురుదేవులు గుణ రహితులైనప్పటికీ లోక కళ్యాణార్థమై సద్గుణ సంపన్నులై ప్రకాశిస్తున్నారు. ఇది కేవలం లోకులకు ఆదర్శప్రాయులై వారిని సన్మార్గములో నడిపించుట కొరకే.

**68. ఓం సర్వాంగ సుందరాయ నమః**

శ్రీ గురుదేవులు రూప రహితులయినా, అతి సుందరమైన రూపము గలవారు. పంచదార చిలక ఎక్కడ కొరికినా తియ్యగా ఉన్నట్లు నిష్కళంకమైన, నిర్గుణమైన, నిస్వార్థమైన త్యాగమయ శరీరముతో, ఆత్మజ్ఞానముతో ప్రకాశించే శ్రీసద్గురుదేవుల రూపము సర్వాంగసుందరము, దివ్యమంగళము.

**69. ఓం ధీరాయ నమః**

శ్రీగురుదేవులు ధీరులు. అనుక్షణ భక్తరక్షణదీక్షా కంకణులైన శ్రీగురుదేవులు తమను ఆశ్రయించిన వారిలో ఆత్మస్థైర్యమును, స్థిరచిత్తమును కలిగించి, వారికి ఎట్టి యీతిబాధలనైనా ఎదిరించగల ధైర్యమును, అరిషడ్వర్గములను సంహరించగల శక్తిని ప్రసాదించి ధీరులైనారు.

**70. ఓం సర్వ లక్షణ లక్షితాయ నమః**

లోకకళ్యాణమునకై అవతరించిన శ్రీగురుదేవులు సర్వ శుభ లక్షణములు కలవారు. ఎవరేని ఏదేని ఉత్తమ లక్షణమును అలవర్చుకొన వలెనని శ్రీగురుదేవులే అందుకు అత్యుత్తమమైన ఉదాహరణగా నిలుస్తారు. వారు అందరికీ ఆదర్శ ప్రాయులు.


- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

కాని ఇప్పుడు? అంతా ఎంతో మారిపోయింది. అప్పుడు అర్జునుని సారథి కృష్ణుడు. ఇప్పుడు కృష్ణుడి సారథి రథాన్ని తోలుతున్నాడు. ఆ దారుకుడు కృష్ణుని ఎన్నోసార్లు ఎన్నోచోట్లకు తీసుకుని వెళ్ళి ఉంటాడు. కాని ఇప్పుడు అర్జునుని ఎక్కడికీ తీసుకుని వెళ్ళలేడు. తనలో వెల్లువలా పొంగి వస్తున్న విషాద సాగరాన్ని అర్జునుడు తనలోనే అణిచివేశాడు. పైగా ఇది విషాదాన్ని వ్యక్తం చేసే సమయం కాదు. కృష్ణుడు వుండి వుంటే తాను ఆవేదన పడినప్పుడు తనను ఓదార్చేవాడు. ధైర్యాన్ని, స్ఫూర్తిని ఇచ్చేవాడు.



ఈ విషాదాన్ని కృష్ణుడు ఒకప్పుడు 'క్లైబ్యం' అని తనను మందలించాడు. కాపురుష వృత్తి పనికిరానిది. ఇప్పుడు తిరిగి ఆ కాపురుష వృత్తే తనను ఆవహించింది. ఈ విషయం కృష్ణుడికి తెలిస్తేనా....! అర్జునుడు తనలో తాను తర్కించుకుంటున్నాడు. అతని ముఖంలో విషాద ఛాయల మధ్య లజ్జారేఖ తోచింది. వరత్వం లేని అర్జునుడి రథం పగ్గాలు కృష్ణుడు పట్టుకోడు. కాపురుషుడైన అర్జునుణ్ణి శ్రీకృష్ణుడు ఆదరించడు.

'దారుకా! అశ్వాలు మూగ జంతువులు. అవి వాటి బాధను చెప్పకోలేవు. రథాన్ని ఆపి వాటి వీపులు నిమిరి ఆప్యాయతతో వాటిని సమాధాన పరచు' అర్జునుడు మొదటిసారిగా నోరు విప్పి అన్నాడు.

దారుకుడు రథాన్ని ఆపాడు. ఆ రెండు గుఱ్ఱాలు కొద్దిగా సకిలించాయి. దారుకుడు క్రిందకు దిగి వాటి వీపు మీద చేయి వేయగానే అవి వణికిపోయాయి. దారుకుడు నెమ్మదిగా వాటి వీపులు నిమిరాడు. వాటి మెడల దగ్గర చేతిని చేర్చి తన తలను ఆనించాడు. దారుకుని దైన్యాన్ని చూసి ఆ అశ్వాలకు కూడా కన్నులు చెమర్చాయి. అర్జునుడు నిర్లిప్తంగా ఇదంతా చూస్తూ కూర్చున్నాడు.

"ఓ అశ్వములారా! మన స్వామి శ్రీకృష్ణుడే మహా కాలుని నిర్ణయాన్ని మార్చటం సముచితం కాదని ఆయనకు అధీనమైపోయాడు. ఆ కాలుడే మాచేత కొన్ని శేష కర్మలు చేయించదలిచాడు. పదండి. మనం ఆ మహాకాలుడి కేలు పట్టుకొని నడుద్దాం.." అని ఆ అశ్వముల చెవులలో చెప్తున్నట్లుగా అన్నాడు దారుకుడు.

ఆ గుఱ్ఱాలు అర్థం అయినట్లుగా సకిలించాయి. కొంచెం దూరంలో నిర్లిప్తంగా, నిశ్చేతనంగా నిలబడి ఉన్న ఆవులు ఒక్కసారిగా తోకలు విదిలించి అప్పడే చైతన్యం వచ్చినట్లు అటువైపు చూచాయి. వాటి కళ్ళలో నుండి మిలమిల  మెరుస్తూ కన్నీటి చుక్కలు అక్కడ పచ్చగడ్డిపై పడ్డాయి.

దారుకుడు రథం ఎక్కి పగ్గాలు పట్టుకున్నాడు. రథం పశ్చిమ దిశగా మళ్ళింది. దుర్గం యొక్క పశ్చిమద్వారం ఇంకా తెరచే ఉన్నది. కోటపైనుండి దుర్గం కాపలా కాస్తున్న రక్షకభటులు రథం దగ్గరకావటం చూడగలిగారు. కోటపైఉన్న నగారా పైన మెల్లగా కొట్టారు. దాని ధ్వని దుర్గమంతా ప్రతిధ్వనించింది. క్రింద ఉన్న రక్షకభటులు సావధానులైనారు. దారుకుడు నడుపుతున్న రథధ్వజంపై ఉన్న జండా గాలికి రెప రెపలాడుతూ చేస్తున్న శబ్దం, రథం చేసే శబ్దాన్ని మింగేస్తోంది.

రథం బాగా దగ్గరకు వచ్చింది. భటులు దారుకుని, అర్జునుణ్ణి గుర్తుపట్టారు. ఆయుధాలు క్రిందికి దించి రథారూఢులైన వారిరువురికీ స్వాగతం పలికారు. అశ్వాలు సకిలించాయి. దారుకుడు వెనుదిరిగి చూశాడు. అర్జునుడు శూన్య నయనాలతో ఆకులన్నీ రాలిపోయి మోడువలెనున్న ద్వారకను చూస్తున్నాడు.


ఇంతకు ముందెప్పడూ ఈ ద్వారకానగరంలోని భవనాల గవాక్షాలు, కిటికీలు అశోకపత్రముల తోరణాలతో, మామిడాకుల తోరణాలతో అలంకరింపబడి ఉండేవి. ప్రతిరోజూ లోగిళ్లలో రంగవల్లులు తీర్చి దిద్దబడి ఉండేవి. వుద్యానవనాలలోని పుష్పములను, ఆకులను, లతలను, నీటితో తడిపిన కారణంగా అక్కడి నేల తడిసి సుగంధాన్ని వెదజల్లుతూ ఉండేది. కాని ఈనాడు అక్కడ ఎప్పడో కట్టిన తోరణాలు ఎండిపోయి వ్రేలాడుతున్నాయి. ఆకులు రాలి, వ్రేలాడుతున్న తాళ్ళు పాములలాగా ఉన్నాయి.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము 46: **కస్తరతి కస్తరతి మాయామ్? యః సంగం త్యజతి, మహానుభావం సేవతే, నిర్మమో భవతి**



తాత్పర్యము: ఈ మాయను ఎవరు దాటగలరు? ఎవరైతే సంగమును త్యజించగలరో మహాపురుషులను సేవించ గలరో, అలాగే మమకారము లేనివారవుతారో వారు (మాత్రమే దాటగలరు).

రెండవ అధ్యాయములో చివరివైన 46వ సూత్రము నుండి 50వ సూత్రము వరకు ఈ మాయను ఎవరు దాటగలరో వారి లక్షణాలను గురించి నారదులు వివరిస్తున్నారు. అయితే నిజానికి ఇది ఒకే సూత్రము లాగా కనిపించినప్పటికీ దీనిలో ఎన్నో సూత్రాల కలయిక ఉందని స్పష్టమవుతుంది.

ఈ సూత్రములలో సాధకుడికి పనికి వచ్చే అనేక అంశాలు ఒక పరిణామ క్రమంలో వివరించబడినవి. వీటిని క్రమబద్ధంగా ఆచరణలో పెట్టగలిగినప్పుడు సాధకుడికి పరాభక్తి తోపాటు ఆత్మతత్త్వం లోని అంతరార్థము కూడా అవగతం అవుతుంది అనడంలో సందేహం లేదు.

మొదటి భాగమైన **కస్తరతి కస్తరతి మాయామ్?** అన్న సూత్రంలోని అంశము ఈ మాయను ఎవరు దాటగలరు? అన్న ప్రశ్నతో మొదలవుతోంది. ఈ మాయను ఒక భవార్ణవముగాను, ఒడ్డుకు చేరలేని ఒక మహాసముద్రంతో పోల్చారు. ఇలాంటి మాయను ఎలా దాటగలము అన్న ప్రశ్నతో పాటు దానికి సమాధానము కూడా ఈ సూత్రములోనే నారదులు ఇస్తున్నారు. “కస్తరతి కస్తరతి” అని రెండుసార్లు ప్రస్తావించడంతో, ఈ మాయను దాటడానికి అన్నింటికైనా ముఖ్యమైన ఆసక్తి, ఆతురత సాధకుడికి ఉండాలన్న విషయాన్ని తెలియజేస్తోంది.

గీతాచార్యులవారు భగవద్గీతలో.....“**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా। మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే**” అంటూ ఈ మాయ మనంతట మనం దాటగలిగినది కాదని దానిని దాటడానికి సద్గురువుల కృప కావాలని, “**మామేవ యే ప్రపద్యంతే - ఏతాం మాయాం తే తరంతి**” అంటూ ఎవరైతే భగవంతుని అవతారమైన గురుదేవుల పాద పద్మములను గాఢంగా విశ్వసిస్తారో వారే మాయను

దాటి తరించగలరని వివరించారు. దీనిని శ్రీ బాబూజీ మహారాజు వారు ఎంతో సులభంగా "విశ్వసించు – తరించు" అన్న మంత్రము ద్వారా ప్రసాదించారు.

"**మహానుభావం సేవతే**" అన్న ఈ సూత్రంలోని భాగము ఈ విషయాన్నే వివరిస్తుంది. అంటే ఈ మాయను దాటడానికి ఒక మహా పురుషుల ఆశ్రయము ఎంతో ముఖ్యమని, అది లేనిదే దాటలేమని దీని భావం. అది కూడా సమర్థులైన సద్గురుదేవులకే ఈ మాయను దాటింపడం సాధ్యమవుతుంది. శంకర భగవత్పాదులు కూడా మహా పురుష సంశ్రయము లేనిదే ముముక్షత్వం లభించదని వివరించారు కదా.

మహానుభావులను సేవించుట అంటే వారికి శుశ్రూషలను చేయడమే అని భావించక వారి మాటలను ఆచరణలో పెట్టడమే నిజమైన శుశ్రూష అని సాధకుడు గ్రహించగలగాలి. గురుదేవుల ఉపదేశమునందు శ్రద్ధ, వారి బోధ యందు ఆసక్తి, తత్వ విచారణ ద్వారా సాధకుడు తరించగలుగుతాడు.

మరి సద్గురుల సమాశ్రయముతోనే మాయను దాటగలమా లేక మన వంతు కృషి కూడా ఉండాలా అన్న ప్రశ్నకు సూత్రములోని మిగతా భాగంలో నారదుల వారు సమాధానం ఇస్తున్నారు. "**యః సంగం త్యజతి**" అంటూ సాధకుడు సంగమును వదలుతాడు అని పేర్కొన్నారు. సాధనలో మొదటి మెట్టుగా దుస్సాంగత్యమును వదలి (ముందు 43వ సూత్రములో వివరించిన విధంగా) సత్సాంగత్యము కొరకు ఆరాట పడాలి. అయితే సత్సాంగత్యము ద్వారా సిద్ధిని పొందిన తర్వాత సాధకుడు అసంగుడై ఉండే పరిపక్వస్థితిని కూడా "**యః సంగం త్యజతి**" అన్నది సూచిస్తుంది.

అలాగే "**నిర్మమో భవతి**" అంటూ నారదుల వారు సాధకుడికి గొప్ప అవరోధమైన మమకారమును కూడా పోగొట్టుకున్నప్పుడే సాధన పురోగతి చెందుతుందని తెలియజేస్తున్నారు. ఆనాడు ఆ మమకారమునే గోపికలు కృష్ణునియందు నిలిపినపుడు అదే పరమ ప్రేమ స్వరూపమైన పరాభక్తియై ప్రకాశిస్తుందని నిరూపించారు. ఆ గోపికల ప్రేమయే సాధకుడికి ఆదర్శం కావాలి.

ఈ విధంగా ఈ సూత్రములో నారదుల వారు ఎవరు తరిస్తారు అని ప్రశ్నిస్తూనే ఈ మాయను దాటడానికి గురు పాదము పట్టవలసిన అవసరమును, తద్వారా సాధనలో పురోగమించవలసిన ఆవశ్యకతను సాధకునికి గుర్తు చేస్తున్నారు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**అక్టోబర్ 2025**

1 బుధ: మహర్నవమి,

2 గురు: విజయదశమి – సామూహిక కుంకుమ పూజలు

3 శుక్ర; ఏకాదశి – ఏకాహం

4 శని: దీక్షావిరమణ, శ్రీ సద్గురు పాదపూజ.

7 మంగళ: ఆశ్వయుజ పూర్ణిమ – శ్రీసద్గురు మండల దీక్ష ప్రారంభం. శ్రీ మాతాజీవారి జన్మదిన మహోత్సవం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

16 గురు: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

19 ఆది : నరక చతుర్దశి, మాసశివరాత్రి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

20 సోమ: దీపావళి పండుగ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

21 మంగళ : అమావాస్య, ఆకాశదీపం

24 శుక్ర; అక్టోబరు 24 నుండి నవంబరు 1 వరకు శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతములు, నవరసములతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్ష బిల్వార్చన.

25 శని : నాగుల చవితి

**నవంబర్ 2025**

1 శని : చిలుక ఏకాదశి – ఏకాహం, శ్రీ సద్గురు పాదపూజ, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతములు, భక్త సమారాధన.

2 ఆది: క్షీరాబ్ది ద్వాదశి – శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

5 బుధ: కార్తీక పూర్ణిమ – గురుపూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. శ్రీ రామలింగేశ్వర స్వామి నగరోత్సవం. జ్వాలాతోరణం.

8 శని : కార్తీక బహుళ తదియ – శ్రీ సద్గురుదేవుల 37వ వార్షిక పుణ్యారాధన ప్రారంభం. ఉ. 9-09 గం.లకు పూజ్య శ్రీ మాతాజీ వారిచే దీక్షా స్వీకరణము. రాత్రి 7.00 గం.లకు శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన.

14 శుక్ర; శ్రీ గురుదశమి – శ్రీ సద్గురుదేవులకు మహాభిషేకము, శ్రీ సద్గురు పాదపూజ, దీపోత్సవం. శ్రీ గురుసాంప్రదాయములోని వారికి శ్రీ సద్గురు మహాపుణ్యారాధన.

15 శని : శ్రీ సద్గురు దీక్షలో ఉన్నవారికి హోమం.

16 ఆది: హోమం పూర్ణాహుతి, దీక్షావిరమణ.

18 మంగళ: మాసశివరాత్రి

20 గురు: అమావాస్య

26 బుధ: మార్గశిర శుద్ధ షష్టి – సుబ్రహ్మణ్య షష్టి

# ప్రేమ మయం

- పెనుమాక నాగేశ్వర రావు

అమ్మంటేనే ప్రేమ. ఎవ్వరికైనా ప్రేమ రుచి తెలిసేది అమ్మ ద్వారానే. అమ్మ చూపులో ప్రేమ, అమ్మ పిలుపులో ప్రేమ, అమ్మ అనునయంలో ప్రేమ, అమ్మ ఓదార్పులో ప్రేమ. అందుకే అమ్మంటే ప్రేమ, ప్రేమంటే అమ్మ. అమ్మ అంతా ప్రేమే. ప్రేమకు నిర్వచనం అమ్మ. ప్రేమ రూపం అమ్మ. అమ్మ అన్నది ఓ కమ్మని మాట, అది ఎన్నెన్నో జన్మల మమతల మూట అన్న సినిమా పాట వింటుంటే ఎంత బాగుంటుంది! అమ్మ అనే మాట ఎంత బాగుంటుంది? అనటానికి బిడ్డలకి, వినటానికి అమ్మకి ఎంత మధురంగా ఉంటుంది ఆ పిలుపు?

ఇటీవల కొద్ది రోజుల వ్యవధిలోనే శ్రీమాతాజీ విదేశీ పర్యటన చేసుకుని తిరిగి వచ్చిన సంగతి మనకి తెలిసిందే. అక్కడి భక్తుల చేత అమ్మ సద్గురుదేవుల పాదపూజలు చేయించటం, బోధ అనుగ్రహించటం వారికి తీర్ధ ప్రసాదాలు అందించటం, ఇవన్నీ సెల్‌ఫోన్ పుణ్యమా! అని మనందరం అమెరికా వెళ్ళక్కరలేకుండానే, ఇక్కడినుంచే చూశాం, ఆనందించాం. విదేశీయులు కూడా కొంతమంది కొన్నిచోట్ల మన సత్సంగాలలో పాల్గొనటం మనం చూశాం. స్వపర బేధం లేని అమ్మ ప్రేమ అందరిపైనా సమానంగా వర్షించటం మనం గమనించాం.

ఆమెది విశ్వప్రేమ. కలవారు, లేనివారు ( ఐశ్వర్యమే కాదు భక్తి కూడా) మధ్య బేధం లేదు. భక్తి కలిగిన వారికి సరే అనుగ్రహం ఎల్లప్పుడూ లభిస్తూనే వుంటుంది. భక్తి లేనివారు కూడా, ఏమిటో ఓసారి చూసి పోదాం అనుకునే వచ్చి ఉండవచ్చు. మన దృష్టిలో వారు కొత్తవారు. కానీ అమ్మ దృష్టిలో వాళ్ళూ అనుగ్రహానికి పాత్రులే. ఎందుకంటే ఏ కారణం చేతనైతే ఏం సద్గురు సన్నిధికి వచ్చారుగా, ఇకనుండి వారిలో వారి వారి యోగ్యతలను బట్టి భక్తి భావాలు కలుగుతై. లేకపోతే ఈ జన్మలో భక్తి జ్ఞాన వైరాగ్య బీజాలు అంకురించినట్లవుతుంది. తదుపరి వారి వారి కర్మ ఫలాన్నిబట్టి ఆ అంకురించిన బీజాలు పెంపొంది ఎప్పటికైనా ఆత్మానంద ఫలము లభిస్తుంది. (మన ప్రార్ధన కూడా అదే కదా).

సహనం అంటే దండించే అధికారం ఉన్నా, దండించక పోవటమని, ప్రేమ అంటే వదిలిపెట్టే అవకాశం ఉన్నా, వదలక పోవడమని, పెద్దలు చెప్పిన మాటలు అక్షరసత్యాలు. అమ్మ ప్రేమలో మనకు ఈ రెండూ గోచరమవుతుంటాయి. అమ్మ చూపు కోసం ఆత్రంగా ఎదురుచూస్తుంటాం. అమ్మ పిలుపు కోసం ఆరాటపడుతుంటాం. అమ్మ

నవ్వుతూ పలుకరిస్తే పరవశంతో పులకరించిపోతుంటాం. ఎందువల్ల? అది అమ్మ గొప్పతనం. అది అమ్మ ప్రేమలోని గొప్పతనం. ఆమె మనసంతా ప్రేమమయం కాబట్టి, ఆమె హృదయం అనురాగమయం కాబట్టి. అమ్మ చల్లని చూపులు మనలో ధైర్యాన్ని కలిగిస్తాయి. మనకి ఉత్సాహాన్ని కలిగిస్తాయి. అది అనుభవైకవేద్యం.

మన ఆశ్రమానికి చాలామంది సాధువులు వచ్చారు. సత్సంగాలు జరిపారు. అలాగే అమ్మ చాలా ఆశ్రమాలు సందర్శించారు. అక్కడ సత్సంగాలు నిర్వహించారు. ఎన్నో ఆలయాలకి వెళ్ళి దర్శనం చేసుకున్నారు. ఆమె సద్గురుమూర్తి ఎదుట నిలుచున్నా, లేక ఏ ఇతర దేవతామూర్తుల ఎదుట నిలుచున్నా, వారితో ఆమె సంభాషిస్తున్నారన్న భావన మనకి కలుగుతుంది. నావంటి సామాన్యులకే అలాంటి భావనలు వస్తున్నప్పుడు, ఇక ఆ మహాతల్లి అనుభూతులు అనుభవాలు ఏలా ఉంటాయో అంతుపడుతుందా? అర్థం అవుతుందా!

ఈమధ్యనే జరిగిన భీమవరం కాళీవనాశ్రమ శాఖ ప్రారంభ ఉత్సవంలో అమ్మ మనందరికీ కండువాలు పంచారు. పిల్లలకు కానుకగా ఆమె అందించారు. ప్రసాదంగా మనం స్వీకరించాం. నిర్విరామంగా అన్ని గంటలు ఆమె అలా అందరికీ చిరునవ్వుతో ఆశీర్వదిస్తూ ఆ వస్త్ర ప్రసాదం అందించటం చూడటమే ఓ మహాభాగ్యం అనిపించింది.

ఏ దేశమేగినా, ఎందు కాలిడినా తలపరా నీ గురుదేవు నామంబు అన్న చందంగా విదేశాల్లో అమ్మ సంకీర్తన చేస్తుంటే ఆ విదేశీయులు కూడా తన్మయులై నాట్యం చేయటం మనం చూశాం. భగవంతుని కన్నా గొప్పది ఉందా అంటే వుంది......అదే భాగవన్నామము అని చెప్పారు. అంతా గొప్పదైన, తియ్యనైన నామాన్ని అమ్మ ఆలపించటం, మనం ఆలకించటం ...అంతకన్నా మధురమైన క్షణాలు వుంటాయా అనడానికి నిదర్శనంగా వారి నాట్యం కనబడింది.

**ఏ ప్రేమ మహిమచే నీ ధారుణీచక్ర మిరుసు లేకుండనే తిరుగుచుండు ఏ ప్రేమ మహిమచే నెల్ల నక్షత్రాలు నేల రాలక మింట నిలిచియుండు ఏ ప్రేమ మహిమచే పృథివిపై బడకుండ కడలిరాయడు కాళ్ళు ముడుచుకొనును ఏ ప్రేమ మహిమచే నీరేడు భువనాల గాలిదేవుడు సురటీలు విసరు ఆ మహాప్రేమ శాశ్వతమైన ప్రేమ. అద్భుతమఖండ మవ్యక్తమైన ప్రేమ నిండియున్నది బ్రహ్మాండమెల్ల . సృష్టి యంతయు ప్రేమమయము అన్న పాపయ్యశాస్త్రి గారి పద్యం గుర్తు రాక మానదు.**

# నమ్మితే బంగారు పిచ్చుకే

- గాదె సత్యనారాయణ మూర్తి

ఒక తండ్రి తన అయిదు సంవత్సరాల కుమారుడితో ఇంటికి దగ్గరలోని దుకాణానికి నడుచుకుంటూ వెడుతున్నాడు. రోడ్డు పైన వున్న ఒక రాయికి కాలు తగిలి, ఆ పిల్లవాడు 'అమ్మా!' అని బాధతో అరుస్తూ క్రింద పడబోతాడు. తండ్రి వెంటనే పిల్లవాడి చెయ్యి పట్టుకుని, పడకుండా ఆపుతాడు. తనను పట్టుకోమని ఆ పిల్లవాడు తండ్రిని అడగలేదు. అయినాగాని, పిల్లవాడి రక్షణ బాధ్యత తండ్రిదే. పైగా పిల్లవాడిని రక్షించడంలో తండ్రి ఆనందం పొందుతాడు. అలాగే గురువు తన శిష్యులను తన బిడ్డలవలె భావించి, అవసర సమయాలలో సలహాలను ఇస్తాడు, ఆదుకుంటాడు, రక్షిస్తాడు.

'నమ్ముకున్న వారికి నమ్ముకున్నంత మహదేవా!' అన్నారు పెద్దలు. సద్గురువును నమ్మి చెడినవారు లేరు. 'నమ్మినవాడు బంగారు పిచ్చుక' అని సద్గురుదేవులు శ్రీబాబు ఎప్పుడూ చెప్పేవారు.

నా బి.కామ్ చదువు గుడివాడలో 1973 సం॥లో అయింది. 1975 లో ఆంధ్రా బ్యాంక్‌లో టెంపరెరీ ఉద్యోగంలో చేరాను. 1978లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పర్మినెంట్ ఉద్యోగం వచ్చి, కొణితివాడ శాఖలో 'క్లర్క్ కమ్ క్యాషియర్' గా చేరాను.

ఒక ఉద్యోగి బదిలీపై కొణితివాడ బ్రాంచికి క్యాష్ ఆఫీసర్‌గా వచ్చాడు. ఆ సమయంలో ఒక కస్టమర్ బంగారు వస్తువులపై ఋణం తీసుకున్నాడు. కానీ, ఆ ఆఫీసర్ కాగితాలపై ఎక్కువ సొమ్ము వ్రాశాడు. ఈ సంగతి 'కస్టమర్'కు తెలియదు. ఏం వ్రాశాడో చూడకుండానే సంతకం చేశాడు. కొన్ని నెలలు తరువాత అసలు సంగతి బయటపడింది. 'ఎంక్వైరీ' మొదలైంది. నన్నూ ప్రశ్నించారు. 'నాకు ఆ సంగతి తెలియదు' అని చెప్పాను. ఆశ్రమానికి వచ్చినప్పుడు ఈ సంగతి శ్రీబాబుతో చెప్పాను. 'ఏమీ ఫరవాలేదులే. నీకేమీ ఇబ్బంది కలుగదులే' అన్నారు బాబు. 'ఎంక్వైరీ' పూర్తి అయింది. అసలు వ్యక్తి ఎవరో తెలిసింది. అతను ఏదోలా నన్ను ఇరికించి, తాను తప్పించుకోవచ్చు. కానీ అలా జరగలేదు. గురువు ఇచ్చిన అభయం అలా నన్ను రక్షించింది.

మా తండ్రి కోదండరామయ్య గారికి ఆరోగ్య సమస్యలు వుండేవి. శ్రీబాబు ఒక మండలం దీక్ష ఇచ్చి, కర్నాటక రాష్ట్రంలోని ధర్మస్థలిలో ఒక గుడిలో చేసుకోమన్నారు. అప్పటికి ఇంకా శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం లేదు. నాన్నగారు దీక్ష పూర్తి చేశారు. దాని ఫలితం?

కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్న నాన్నగారు 1974 సం.లో ఒక రోజు భీమవరం నుండి ఉండి రోడ్డులో కారులో వెడుతున్నారు. అద్దం దింపి ఎడమ చేతిని డోర్‌పై పెట్టుకున్నారు. సైకిల్‌పై వెడుతున్న ఒక కుర్రవాడు పొరపాటున స్పీడ్‌గా కారు ప్రక్కగా వచ్చాడు. సైకిల్ హ్యాండిల్ బార్ నాన్నగారి ఎడమ మోచేతికి తగిలింది. చాలా నొప్పి కలిగింది. ఎముక ఫ్రాక్చర్ అయిందేమో అనే సందేహం వచ్చింది. ఆసుపత్రికి వెళ్ళాలా వద్దా అనే మీమాంసలో పడ్డారు. కాని గురుదేవులకు చెప్పకుండా ఏ పనీ చెయ్యని నాన్నగారు శ్రీబాబుని కలిసి, జరిగిన సంగతి చెప్పారు. 'ఫ్రాక్చర్ లేదు, ఏమీ లేదు. ఆసుపత్రికి వెళ్ళనక్కర్లేదు. రెస్ట్ తీసుకో. మందులు వాడు. కొద్దిరోజులకు తగ్గిపోతుందిలే. ఫరవాలేదు' అన్నారు బాబు. సత్యవాక్కు! కొద్దిరోజులకే చెయ్యి నొప్పి తగ్గిపోయింది.

ఒకసారి నేను, నాన్నగారు ఆశ్రమంలో శ్రీబాబును కలిశాము. ఏదో సందర్భం వచ్చి, నాన్నగారితో శ్రీబాబు 'పెళ్ళిళ్ళు వాడేం చేస్తాడు' అని నన్ను ఉద్దేశించి అన్నారు. సర్వజ్ఞులు శ్రీబాబుకు నా (అ)శక్తి గురించి పూర్తిగా తెలుసు అనుకున్నాను. అలాగే, నేనేమీ కష్టపడకుండానే, నా చెల్లి సుందరి పెళ్ళి, నా ముగ్గురు కుమార్తెల పెళ్ళిళ్ళు ఘనంగా జరిగాయి. శ్రీబాబు ఆశీర్వాదం!

2012 సం.లో నేను ఏలూరులో క్యాషియర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. కొద్ది రోజులలో నా రెండవ కుమార్తె జయ కాళీమాత పెళ్ళి వుంది. ఒకసారి నేను ఎక్కువ రోజులు సెలవు పెట్టి ఆశ్రమానికి వచ్చాను. అన్ని రోజులు సెలవు పెట్టనవసరం లేదు. కాని నాకు తెలియకుండానే గురుశక్తి కల్పించుకుని, నా చేత ఎక్కువరోజులు సెలవు పెట్టించింది. నేను సెలవులో వున్న సమయంలో బ్యాంక్‌లో చాలా పెద్ద సొమ్ము షార్టేజ్ (తక్కువ) వచ్చింది. నేను ఎక్కువ రోజులు సెలవు పెట్టడం వలన నాకు ఎటువంటి సమస్య కలుగలేదు. ఆ సమయంలో నేను డ్యూటీలో వుంటే చాలా గొడవ అయి వుండేది. కాని, గురు రక్షణ మన వెన్నంటే ఉంది కదా! నమ్మినవాడికి బంగారు పిచ్చుకే!

**భగవద్భక్తిని, ఆధ్యాత్మిక దృష్టిని అలవరచుకోవడం ద్వారా, ప్రబల శాంతి, స్నేహం, సౌమనస్య సామరస్యాలను పెంపొందించుకోవచ్చు.**

- శ్రీ కాళీబాబు

# నిరీక్షణ

(గత సంచిక తరువాయి)

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

దేవతలు హనుమంతునియొక్క పరాక్రమమును, జ్ఞానమును పరీక్షించదలచి సురస అనబడు నాగమాతను పంపారు. ఆమె ఒక రాక్షస స్త్రీ రూపమును దాల్చి, పొడుగాటి తన తోకతో హనుమంతుని చుట్టివేసి, "అహంకారముతో కూడిన ఓవానరవీరుడా! నాకు ఇప్పుడు చాల ఆకలిగ ఉంది. కావున నీవు ఆహారముగ నా నోటిలోపడి నా ఆకలిని తీర్చవలయును" అన్నది. హనుమంతుడు ఆకస్మాత్తుగ తన రూప వైశాల్యమును పెంచాడు. సురస కూడా తన నోటిని పెద్దది చేసింది. చటుక్కున హనుమంతుడు సూక్ష్మరూపమునకు వచ్చి ఆమె నోటిలోనికి వెళ్ళి, ఆమె ఒక శ్వాస విడువకమునుపే నాసికారంధ్రము నుండి వెలుపలికి వచ్చాడు. హనుమంతుని సూక్ష్మబుద్ధికి మెచ్చిన సురస తన పూర్వ రూపమునకు వచ్చి "నీవుసాధించలేనిది ఏదియూ లేదు. నిన్ను విజయం వరించుగాక!" అని దీవించింది.

ఈ విధముగ సహకరించమని కోరిన వారి బాధలనుండి దాటుకొనుచు ముందుకు సాగుచున్న హనుమంతునికి శోధనగ 'సింహిక' అనబడు ఒక రాక్షసి ఆతని నీడను అనుసరిస్తూ, ఆతనిని తన నోటిలోనికి లాక్కుంది. 'తీరని నా ఆకలికి నీవే ఆహారమ'ని చెప్పి హనుమంతుని మ్రింగివేసింది. మిక్కిలి బలవంతుడైన ఆ వానరుడు ఆమె యొక్క ఉదరమును చీల్చివేసి ప్రేగులను తనపై వేసుకుని ఆమె శరీరము నుండి ఆకాశములోనికి వచ్చాడు. సింహిక మరణించింది. హనుమంతుని సాహసములను గాంచి ఆకాశమందు సంచరించు సిద్ధులు, "ఈతని వద్ద జ్ఞాపకశక్తి, మేలిమిజ్ఞానము, ప్రయత్నమందలి అకుంఠిత శ్రమ, కార్యదీక్ష మున్నగు నాల్గు శ్రేష్ఠమైన గుణములు అంతర్లీనమై ఉన్నాయి. కావున ఈతడు చేసిన ప్రయత్నములన్నియూ ఫలించును" అని హనుమంతుని కొనియాడారు.

వారి పొగడ్తలను లెక్కజేయక హనుమంతుడు రామ నామమును జపించుకొనుచూ, తనకార్యమందు నిమగ్నుడై అలా

ఎగురుచూ పోయి సముద్రమును దాటి లంకా నగరమును చేరుకున్నాడు.

తీరమును చేరిన వెనువెంటనే తన రూపమును తగ్గించుకుని, భవనముల పైన నడవడం ఆరంభించాడు. అకస్మాత్తుగ ఎవరో తన తోకను పట్టి లాగుచున్న భావనకు గురై, వెనుకకు తిరిగి చూసిన హనుమంతునికి ఎత్తుగను, ఆగ్రహంతో ఎరుపెక్కిన కళ్లతో, ముందుకు చొచ్చుకుని వచ్చినట్లగుపడు దంతములు, వ్రేలాడు నాలుక, చింపిరి జుత్తు కలిగి కడు ఘోరముగ ఆ నగర దేవతయైన లంకిణి కనబడింది.

"నన్ను దాటుకుని మిక్కిలి ధైర్యంగా నీవు లంకానగరమందు ప్రవేశించితివి, నీవెవరవు?" అని గర్జించింది లంకిణి.

"ఎలాగో ఇక్కడకు వచ్చి చేరాను. నాకు ఎంతోకాలం నుండి ఈ అందమైన నగరమును, లంకానగర రాజభవనం చూడాలని ఆశ. కావున నన్ను దయచేసి లోనికి వెళ్లనిమ్ము" అన్నాడు హనుమంతుడు.

దెయ్యంలా నవ్విన లంకిణి, "అలాగా! ఇక్కడికి రా!" అని పిలిచి, హనుమను సర్రుమని తన ముందుకు లాగి, చెంపమీద ఫెల్లుమని చెంపదెబ్బ కొట్టింది. ఈ సంఘటనను ఎదురుచూడని హనుమ దబ్బుమని క్రింద పడిపోయాడు. వెంటనే తనను తాను సంబాళించుకొని, తన కుడిచేతి పిడికిలితో ఆమె ముఖంపై బలంగా ఒక గుద్దు గుద్దాడు.

ఆ నొప్పికి ఓర్చుకోలేక క్రిందపడిన లంకిణికి పాత విషయమొకటి జ్ఞప్తికి వచ్చింది. "ఆహా! బ్రహ్మదేవుడు చెప్పినట్లుగనే రావణుని ఆఖరి గడియలు సమీపించుచున్నట్లున్నాయి" అని స్వగతంలో అనుకుని, హనుమంతునికి వందనమొసగి, ఓ వానరా! నీకు మిక్కిలి కృతజ్ఞతలు. మీ మూలంగా నాకు కొంచెమైనా నచ్చనటువంటి ఈ సేవకురాలి పనినుండి విముక్తి లభించింది" అని వినమ్రతతో తెలిపింది. ఆశ్చర్యంతో తనవైపు చూస్తున్న హనుమంతునికి ఆమె తన కథను తెలుప నారంభించింది.

"నేను ఒక దేవమాతను. విధి వక్రించుట చేత కుబేరుని కొరకు నిర్మించబడిన ఈ లంకానగరమునకు, కుబేరుడు నన్ను కాపలా దేవతగా నియమించాడు. ఆతని మారటితల్లి కుమారుడు,

పరాక్రమశాలియైన రావణుడు, కుబేరుడ్ని యుద్ధమందు ఓడించి, ఈ దీవిని, ఆతని పుష్పకవిమానమును అపహరించుకున్నాడు. రావణుని ఈ ఆక్రమణను సహించలేకపోయిన నేను, బ్రహ్మదేవుని వద్దకు వెడలి, మొరపెట్టుకున్నాను.

బ్రహ్మదేవుడు, "లంకిణీ! నీవు అచ్చోటనే కాపలా దేవతగనే కొంతకాలము కొనసాగుము" అన్నారు. "నాకు కరుణలేనటువంటి ఈ రావణుని వద్ద పనిచేయుటకు మనసు అంగీకరించుట లేదు" అని బదులిచ్చినప్పుడు, ఆతడు "కలత చెందవలదు. రావణుని మరణకాలం ఆసన్నమైనప్పుడు నీవు నావద్దకు వచ్చెదవు" అని చెప్పారు. "ఆ సమయ మెప్పుడు వస్తుందో!?" అన్న నా సంశయ పూర్వకమైన ప్రశ్నకు, బ్రహ్మదేవుడు, ఎప్పుడైతే నీవు ఒక బలమైన వానరుని చేత దెబ్బతిని క్రిందపడతావో, అప్పుడు నీవు రావణునికి ఆఖరి గడియలు ఆసన్న మగుచున్నవని గ్రహించగలవు. ఆ పిదప నీవు ఇచ్చటకు రాగలవు" అన్నారు. "ఓ వానర మిత్రమా! నీకు మంగళము చేకూరుగాక! నీవు ఎందులకు సముద్రమును దాటి, ఇచ్చోటకు విచ్చేసితివో ఆ కార్యము సఫలీకృతమగు గాక!" అని పలికి లంకిణి బ్రహ్మలోకము వైపుకు వెళ్ళి పోయింది.

"రాముని అనుగ్రహముచే ఈ నగరములోనికి ప్రవేశించిన నాకు అన్నీ శుభశకునములే అగుపడుచున్నాయ"ని తలచుకొనుచు హనుమంతుడు లంకానగరములోనికి ప్రవేశించాడు. - సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తురాలు, ఆశ్రమవాసులు అయిన శ్రీమతి బొమ్మిశెట్టి కాళీమాత (అంబాజీపేట కాళీ)గారు 13-9-2025 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 65 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

అక్టోబర్ 2025

2 గురు: విజయదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

7 మంగళ: ఆశ్వయుజ పూర్ణిమ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 గురు: శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

20 సోమ: దీపావళి పండుగ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

నవంబర్ 2025

1 శని : చిలుక ఏకాదశి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

5 బుధ: కార్తీక పూర్ణిమ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

8 శని : కార్తీక బహుళ తదియ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

14 శుక్ర: శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 బుధ – సుబ్రహ్మణ్య షష్టి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

అక్టోబర్ 2025

2 గురు: విజయదశమి – శ్రీ సద్గురు పాదపూజ.

7 మంగళ: ఆశ్వయుజ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ.

16 గురు: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ.

20 సోమ: దీపావళి పండుగ – శ్రీ సద్గురు పాదపూజ.

నవంబర్ 2025

1 శని : చిలుక ఏకాదశి – శ్రీ సద్గురు పాదపూజ.

5 బుధ: కార్తీక పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ.

8 శని : కార్తీక బహుళ తదియ – శ్రీ సద్గురు పాదపూజ.

14 శుక్ర: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ.

26 బుధ: సుబ్రహ్మణ్య షష్టి – శ్రీ సద్గురు పాదపూజ.

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**అజ్ఞాన మూల హరణం, జన్మ కర్మనివారకమ్**

**జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం గురోః పాదోదకం పిబేత్. 31**

**పదవిభాగము** :-

అజ్ఞానమూల హరణం-జన్మకర్మనివారకమ్- జ్ఞానవైరాగ్య- సిద్ధ్యర్థం- గురోః-పాదోదకం-పిబేత్.

**టీక** :- అజ్ఞాన=అవిద్యయును; మూల=వేరును; హరణం=నశింప జేయుటకును; జన్మ=జన్మలు; కర్మ=కర్మలు(అను) శాఖలను; నివారకమ్= నివారించుటకును; జ్ఞాన=జ్ఞానము; వైరాగ్య=వైరాగ్యము; సిద్ధ్యర్థం= సిద్ధించుటకును; గురుపాదోదకం=గురుపాదతీర్థమును; పిబేత్=త్రాగవలెను.

**వ్యాఖ్య** :- "అజ్ఞానమను వేరును నశింపజేయుటకును, జన్మకర్మలను నివారించుటకును, జ్ఞాన వైరాగ్య సిద్ధికొరకును గురు పాద తీర్థమును గ్రోలవలెను" అని గురుపాద తీర్థ మాహాత్మ్యాన్ని యింకా లోతుగా వివరిస్తున్నాడు పరమశివుడు. సంసారమనే మహా వృక్షానికి అజ్ఞానమనేది తల్లివేరు. ఆ అజ్ఞానమూలాన్ని (లేక మూలాజ్ఞానాన్ని) ఛేదిస్తేనే గాని జన్మ పరంపర నశించదు. జన్మరాహిత్యం అయితే గాని కర్మరాహిత్యం కాదు, వివేకం కల్గితే గాని వైరాగ్యం కలుగదు. వైరాగ్యం కలగాలంటే సంసారమనే అశ్వత్థ వృక్షం నశించవలసిందే. ఈ విశేషమైన భావన అంతా ఒక్క 'మూలం' అనే పదంలో నిక్షేపించబడి అద్భుతమైన రూపకంగా స్ఫురింపజేయబడినది.

ఈ సంసార వృక్షం ఊర్ధ్వ మూలము, ఊర్ధ్వము అంటే శ్రేష్ఠము అనే అర్థం కూడ వున్నది, సంసారమంటే మాయ. మాయ బ్రహ్మములో కల్పించబడినది. వంశ వృక్షాలను తలక్రిందుగా వ్రాస్తారు, అందువల్లనే యీ సంసారమనే వృక్షము అశ్వత్థమన్నారు. "శ్వ" అంటే రేపు. రేపటి వరకు వుండేది "శ్వత్థము". ఉండనిది "అశ్వత్థము". అశ్వత్థము అంటే రావిచెట్టు. అంతా తొఱ్ఱ. తినటానికి పనికి వచ్చే పళ్ళుండవు. వాసన చూడటానికి

పుష్పులుండవు, దీని ఆకులు నిరంతరం కదలుతూ ఉండటం వల్లనే దీనికి 'చలదళ' మనే పేరు వచ్చింది. ఎందుకూ పనికి రాకపోయినా, గొప్పగా, పెద్దగా, ఎత్తుగా కన్పించి లేని గొప్పతనాన్ని తోపింప జేస్తుంది. కాని సంతాన ప్రాప్తికై జనులు రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేయటం మనం చూస్తున్నదే, ఆ దృష్టితో చూస్తే లౌకిక సంసారాన్ని పెంచటానికి అది ఉపయోగపడుతుంది.

నీరు వృక్షం పెరుగుదలకు దోహదకారి. నీరుపోస్తే మొక్క చిగురించాలి. అది మామూలు జలం అయితే. కానీ గురుపాదోదకం విభిన్నమైనది. అది శిష్యుని దుఃఖానికి కారణమైన సంసారవృక్షపు మూలాన్ని నశింపచెయ్యటమనే విచిత్ర కార్యనిర్వహణకు తోడ్పడుతుంది.

**గురు పాదోదకం పానం, గురోరుచ్ఛిష్ట భోజనమ్**

**గురుమూర్తిః స్సదాధ్యానం, గురోర్నామ సదాజపేత్.** 32

**<u>పదవిభాగము</u>** :-

గురుపాదోదకం-పానం-గురోః-ఉచ్ఛిష్ట భోజనం-గురు-మూర్తిః-సదా-ధ్యానం-గురోః-నామ-సదా జపేత్.

**<u>టీక</u>** :- గురుపాదోదకం=గురుపాదతీర్థము; పానం=దప్పిక తీర్చునదిగ (కుర్యాత్ = చేయవలెను అను క్రియ అన్వయించుకొనవలెను) గురోః = గురుదేవుని; ఉచ్ఛిష్టం=భుక్తశేషము; భోజనం=భోజనముగ (కుర్యాత్= చేయవలెను); గురుమూర్తిః=శ్రీ గురుదేవుని స్వరూపము; సదా=ఎల్లపుడు; ధ్యానం=ధ్యానము (కుర్యాత్=చేయవలెను), గురోః=గురుదేవుని; నామ=నామము; సదా=ఎల్లపుడు; జపేత్=జపించవలెను.

**<u>వ్యాఖ్య</u>** :- "గురు పాదతీర్థమునే పానీయముగాను, గురు భుక్త శేషాన్నే భోజనంగాను, గురు స్వరూపాన్నే ధ్యేయ వస్తువుగాను, గురునామమునే జపించవలసిన మంత్రముగాను" (సాధకుడు) జీవితమును గడపవలెనని బ్రహ్మామయుడు కాదలచుకొన్న సాధకునకు చేయవలసిన సాధనను యిక్కడ సూచిస్తున్నాడు స్వామి. దేహధారి అంటేనే మూడు భాగములు కలవాడు. అవి మనస్సు, వాక్కు, కాయము (శరీరము). దేహానికి ఆకలి దప్పులూ, వాక్కుకు మాటలూ,

మనస్సుకు ఆలోచనలూ సహజం. వీటిని తప్పించుకోవటానికి సాధ్యంకాదు. అందుచేత ఈ మూడింటిని ఎటువంటి సాధన ద్వారా బ్రహ్మమయం చేసుకొన వచ్చునో యిక్కడ తెలియజేయబడుతున్నది. సచ్ఛిష్యుడైన సాధకుడు గురోచ్ఛిష్టాన్నే భుజించాలి. ఉచ్ఛిష్ట మంటే యిక్కడ “ఎంగిలి” అనిగాని, “తినగా మిగిలినది” అనిగాని అర్థముకాదు. పరబ్రహ్మ స్వరూపుడైన గురుదేవుడికి భోజనం అనందానుభవము. శిష్యుడు దానిని పొందాలి, గురు పాదోదకం అంటే గురువుచేత బోధింపబడిన(పద=బోధ) బోధ అనే తీర్థం. అంటే గురు బోధను నిరంతరం మననం చేస్తూ నిదిధ్యాసకు తెచ్చుకోవాలి. ఎల్లపుడూ మనస్సుతో గురుదేవుడి విశ్వవ్యాపక చైతన్యమూర్తినే ధ్యానించాలి. పలికితే గురునామాన్నే పలకాలి, ఇలా చేస్తే అచిరకాలంలోనే దేహి బ్రహ్మమయుడు కాగలడు.

- సశేషం

**శ్రీ మాతాజీ కార్యక్రమములు**

8-10-2025 బుధవారం పెదనిండ్రకొలను శాఖలో శ్రీ సద్గురు పాదపూజ, పూజ్య శ్రీ మాతాజీ జన్మదిన వేడుక.

25-10-2025 శనివారం గోపవరం గ్రామములో శ్రీ మాతాజీ వారి సత్సంగము.

6-11-2025 గురువారం శ్రీ కాళీప్రసాద ఆశ్రిత ఆశ్రయం, నందికొట్కూరు, 4వ వార్షికోత్సవములో పూజ్య శ్రీ మాతాజీ వారి సత్సంగం.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## అప్పన వారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

ఆ తరువాత సత్సంగ సమావేశము ప్రారంభమయ్యేది. కొంత సేపు గౌతమీ జలాలకు కూడా పవిత్రతను కలిగించగల మధుర నామ సంకీర్తన జరిగేది. అనంతరము గురువుగారు, తారకంగారు మొదలగు భక్తులు వారి భక్తి భావనలను యితర భక్తులందరితో కలిసి పంచుకునే అవకాశమును శ్రీ బాబు కల్పించే వారు.



అప్పుడు శ్రీ బాబు హరుడై హరి తత్త్వమును, హరియై హర తత్త్వమును, గురుడై పరతత్త్వమును మేళవించి, బాల వృద్ధ సుబోధకమైన, పండిత పామర రంజకమైన తమ భవ్య సందేశమును అందించేవారు. ఆ సందేశమును అందుకొని, తమ హృదయ భాండములలో గురు తత్త్వమనే అమృతమును నింపుకొని, ఆనంద పరవశులైన భక్తులు శ్రీ సద్గురు దివ్య చరణములకు ప్రణమిల్లి సాష్టాంగ వందన పూర్వకముగా శరణాగతులైన భక్తులకు శ్రీబాబు 'రక్ష'ను ప్రసాదించే వారు. అది భవసాగరం నుండి భక్తులను రక్షింపగల 'గురు రక్ష'. అనంతరము భక్తులందరూ తీర్థ ప్రసాదములు స్వీకరించేవారు.

భక్తజన పరివేష్టితులైన శ్రీ సద్గురు దివ్యమూర్తి వెదజల్లే దివ్యకాంతులతో గౌతమీ జలాల మధ్య వెలుగొందే ఆ మహావేదిక, క్షీర సాగరంలో విరాజిల్లే శేషతల్పమా? కైలాసాద్రిపై నటరాజ శేఖరుడు తాండవమాడే శివతాండవ రంగమా? సుర ముని గణాలతో అలరారే అమరేంద్రుని దివ్యసభారంగమా? కాదు! కాదు! వాటన్నిటిని మించి, శ్రీగురుచరణ పంకజద్వయముతో ప్రకాశించే నిజభక్తుని అంతరంగమే ఆ గురుపూజా రంగము!

త్రిలోకములలోను దుర్లభమైన యీ అపురూప సన్నివేశమును స్వయంగా దర్శించుకొని ధన్యత్వమును పొందటానికి బాల సూర్య భగవానుడు వచ్చి తూర్పు కొండపై నిలిచి, తనకు నిజ ప్రకాశమును ప్రసాదించిన గురుసూర్యునికి అరుణ కుసుమాంజలులతో ప్రణామములు తెలుపుతుండగా, చీకట్లతోబాటు భక్తుల బహు తాపాలు, జన్మజన్మల పాపాలు మటుమాయమవుతుండగా, సత్య వస్తువును దర్శింపజేసే గురుసూర్యుని జ్ఞానకిరణములా అన్నట్లు జగత్తును ప్రకాశింపజేసే బాలభానుని కిరణాలు నలుదిశల ప్రసరిస్తుండగా, జయజయ ధ్వానాలతో పరిసరాలు మారుమ్రోగుతుండగా సభ సమాప్తమై శ్రీబాబుతో బాటు భక్తులందరూ తిరిగి వచ్చేవారు.


**1965**లో ప్రారంభమై **1971** వరకు జరిగిన యీ మహోత్సవ దృశ్యాలు, ఆనాడు దర్శించిన భక్తుల హృదయాలలో యీనాటికీ, నిన్నటి దృశ్యాలే అనిపించే విధంగా మనస్సులలో హత్తుకుని పోయాయి!

ఈ మహాభాగ్యాన్ని అశేష భక్తకోటికి కొన్ని సంవత్సరాలు అందించటానికి నిమిత్త మాత్రురాలైన భూషణమ్మగారు చిరస్మరణీయులు. అంతే కాదు! అలా ప్రతి మహా శివరాత్రి ఉదయమూ భూషణమ్మగారు శ్రీ గరుదేవులకు మహాభిషేకం జరుగుతున్నంత సేపూ శ్రీస్వామి దివ్య పాదారవిందములను తమ పర్యంకములపై నిలుపుకొని, స్వామికి అభిషేకించిన జలమంతా ఆమెను పవిత్రురాలిని చేస్తూ ఆమెపై పడుతుండగా, స్వామిని సేవించుకున్నారు. ఆ సుకృతము దేవ, మానవ, దానవ కోటులలో కూడా ఏ ఒక్కరికో మాత్రమే లభ్యమయ్యే అపురూప వరము. ఆ విధంగా ఆమె జన్మ చరితార్థమైనది.

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు -రమణ ప్రసాద్

# వేమన

కుండ కుంభమన్న కొండ పర్వతమన్న
నుప్పు లవణమన్న నొకటిగాదె
భాషలిట్టివేరు పరతత్వమొక్కటె
విశ్వదాభిరామ వినురవేమ ॥



గంగిగోవుపాలు గంటెడైనను చాలు
కడివిడైనను నేమి ఖరము పాలు
భక్తిగలుగుకూడు పట్టెడైనను చాలు
విశ్వదాభిరామ వినురవేమ ॥

చిప్పలోన బడ్డ చినుకు ముత్యంబయ్యె
నీటబడ్డ చినుకు నీట గలిసె
బ్రాప్తిగలుగు చోట ఫలమేలతప్పురా
విశ్వదాభిరామ వినురవేమ ॥

ఆత్మశుద్ధిలేని యాచారమదియేల
భాండ శుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజలేలరా
విశ్వదాభిరామ వినురవేమ ॥

ఆపదైనవేళ నరసే బంధులజూడు
భయముచేత జూడు బంటుతనము
పేదవేళ జూడు పెండ్లాము గుణము
విశ్వదాభిరామ వినురవేమ ॥

ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు
కాని యతకవచ్చు గ్రమముగను
మనసు విరిగెనేని మరిచేర్చ రాదయా

విశ్వదాభిరామ వినురవేమ ॥

ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు
చూడ చూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా
విశ్వదాభిరామ వినురవేమ ॥

ఎంత చదువు చదివి యేనీతి విన్నను
హీనుడ వగుణంబు మానలేడు
బొగ్గుపాలఁగడుగు పోవునా మలినంబు
విశ్వదాభిరామ వినురవేమ ॥


తన్నెఱుంగని వాడు తానె తానై యుండు
తన్నెఱుంగువాఁడు తానె తాను
తనువులేని వాఁడు తానె తానౌ సుమ్మి
విశ్వదాభిరామ వినురవేమ ॥


**మనస్సు చేసే మాయాజాలమే అన్ని లంపటాలకు మూలం. భౌతిక సుఖభోగాలపట్ల ఆసక్తి జనించడం అతిసహజం. ప్రాపంచిక విషయాలవైపు మనస్సు వ్యామోహితం కాకుండా చూడడం ఎంతో ముఖ్యం. భౌతిక వాసనల నుండి మనస్సు వికర్షింపబడాలంటే భగవంతుని పాదపద్మాల చెంత మోకరిల్లడం వినా మార్గాంతరం లేదు. అప్పుడే ఈ ప్రాపంచిక వాసనలు ఎంత నిస్సారమైనవో తెలుస్తుంది.**

- శ్రీ కాళీబాబు


Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## జర్మనీ లోని పరమహంస విశ్వానంద స్వామివారి ఆశ్రమం
## (విఠల్ ధామ్) దర్శన దృశ్యములు










REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## జర్మనీ లోని పరమహంస విశ్వానంద స్వామివారి ఆశ్రమం (విఠల్ ధామ్) దర్శన దృశ్యములు







పరమహంస
విశ్వానంద స్వామివారు
శ్రీరామ్, హనుమత్ జయప్రద గార్ల
గృహమునందు

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.